# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 22, సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## దూసుకొస్తున్న తీవ్ర వాయుగుండం



మిగతా 4లో..

## నీళ్లడిగిన రైతుల చేతులకు సంకెళ్లా?



- కాంగ్రెస్ పాలనా వైఫల్యాన్ని ప్రశ్నిస్తే అరెస్టులా?
- పాలమూరుకు ద్రోహం చేస్తున్న సీఎం రేవంత్
- జూరాల నీళ్లడిగిన రైతులను, బీఆర్ఎస్ నేతలను అరెస్టు

చేయడాన్ని ఖండిస్తున్నాం : హరీశ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21: కృష్ణా జలాలను శ్రీశైలం నుంచి 738 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెన్నా బేసిన్ ద్వారా కుప్పం వరకూ తరలిస్తుంటే.. పక్కనేఉన్న పాలమూరుకు ఎందుకు తరలించడం లేదని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉప నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనా వైఫల్యాన్ని, పాలకుల చేతగానితనాన్ని ప్రశ్నిస్తే.. అరెస్టులు చేసి, నిర్బంధిస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన నిలదీశారు. "గడిచిన రెండున్నరేళ్లూ కృష్ణానదిలో పుష్కలంగా నీళ్లు పారినా మోటర్లను ఎందుకు నడపలేదు? శ్రీశైలం నిండుకుండలా ఉన్నా రైతులకు నీళ్లు ఎత్తిపోసే ఆలోచన ఎందుకు చేయలేదు? కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు వదిలిపెట్టి తెలంగాణ రైతుల ప్రయోజనాలను ఎందుకు గాలికొదిలేశారో.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గానీ, నీళ్ల మంత్రి ఉత్తమ్ గానీ సమాధానం చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

### బీఆర్ఎస్ నాయకుల అక్రమ
## అరెస్టు దుర్మార్గం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,సెప్టెంబర్-21
జూరాల ఆయకట్టుకు సాగు నీరిచ్చి పంటలు కాపాడా లని రైతుల పక్షాన డిమాండ్ చేసిన ఉమ్మడి పాలమూరు జిల్లా బీఆర్ ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, సి.లక్ష్మారెడ్డి, శ్రీని వాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలను, బీఆర్ఎస్ పార్టీ నాయకులను అక్రమంగా నిర్బంధించడం రేవంత్ రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని ఆరోపించారు. కళ్లముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతల గోసను ప్రభుత్వం తీర్చాల్సిందిపోయి , న్యాయమైన డిమాండ్ తో నిరసనకు సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ సర్కారు కుట్ర చేస్తోందని విమర్శించారు.సీఎంగా విఫలమైన రేవంత్ తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే, బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులని అన్నారు. జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా కూడా విడుదల చేయకుండా పనికిరాని కుంటిసాకులతో రేవంత్ సర్కారు పచ్చని పంటల ఉసురు తీస్తోందని పేర్కొన్నారు. తమ పంటలను కాపాడుకునే ఏకైక తపనతో

# సాగునీటి కోసం రైతుల ఆందోళన

- ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం యత్నం, అరెస్ట్
- ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్
- డ్యాం చుట్టూ పోలీస్ పహారా
- గులాబీ నేతలు వర్సెస్ పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట
- రైతుల నిరసనకు మద్దతుగా బీఆర్ఎస్ ధర్నా,హౌస్ అరెస్టులు



హైదరాబాద్, సెప్టెంబర్ 21: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి సాగు నీటిని విడుదల చేయాలంటూ బీఆర్ఎస్ ఇచ్చిన పిలుపుతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. జూరాల డ్యాం ముట్టడికి రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావడంతో ప్రాజెక్టు వద్ద హైటెన్షన్ నెలకొంది. రైతుల ఆందోళనకు మద్దతుగా జూరాల డ్యాంపై ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు చుట్టూ 12 కిలోమీటర్ల పరిధిలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రులు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బాసు హనుమంతునాయుడు తదితరులను పోలీసులు తెల్లవారుజామున హౌస్ అరెస్ట్ చేశారు. పాలమూరు జిల్లాలో సాగునీటి కోసం రెండు రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. జూరాల ఆయకట్టులో పొలాలు ఎండిపోవడంతో శనివారం రైతులే స్వయంగా ఎడమ కాలువ గేట్లు ఎత్తి నీటిని

మిగతా 3లో..

## 'దానం' పిటిషన్ విచారణకు అనుమతి



- రేపు సుప్రీం కోర్టులో విచారణ

వివరాలు 2లో..

### పార్టీ శ్రేణుల అణచి వేతకు
# రాష్ట్ర సర్కారు కుట్ర

- ప్రభుత్వ వైఖరి మారకుంటే ఉద్యమానికి శ్రీకారం
- మేం తప్పులు చేస్తే చర్యలు తీసుకోవచ్చు
- సిరిసిల్లలో 8 వేల ఎకరాలు కబ్జా చేసిందెవరు? : బీఆర్ఎస్ నేతల అరెస్టుకు కేటీఆర్ ఖండన
- జూరాలలో నీళ్లున్నా ఎందుకు విడుదల చేయటం లేదు?
- ప్రభుత్వ వైఖరి మారకుంటే ఉద్యమానికి శ్రీకారం : బీఆర్ఎస్
- నేతల అరెస్టుకు కేటీఆర్ ఖండన



హైదరాబాద్,సెప్టెంబర్-21
జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. జూరాల ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు యత్నించిన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వరద జలాలపై కట్టిన

మిగతా 3లో..

### ఎన్నికలు జరుగని జీపీలకు
## 33కోట్లు : సీతక్క



హైదరాబాద్,సెప్టెంబర్-21
కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల ఎన్నికలు జరుగని 58 గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.33.62 కోట్లు విడుదల చేసినట్టు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క చెప్పారు. ఎన్నికలు జరుగలేదన్న కారణంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు అందకపోయినా, గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపో కుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా నిధులు సమకూర్చినట్టు సోమవారం విలేకరులకు తెలిపారు.ఎల్‌నినోతో ఎదురయ్యే పరిస్థితులను సమర్థంగా ఎదురొనేందుకు గ్రామస్థాయిలో పటిష్ట మైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సీతక ఆదే శించారు. సోమవారం పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీని మాడల్ పంచాయతీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## 'ఇందిరమ్మ' నిబంధనలు సడలింపు

పొంగులేటి



హైదరాబాద్,సెప్టెంబర్-21
ఇందిరమ్మ ఇండ్ల నిబంధనలు సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి వెల్లడించారు. బేస్‌మెంట్ లేదా పైస్థాయికి చేరిన ఇండ్లకు వన్‌టైమ్ ద్వారా క్లియరెన్స్ ఇవ్వనున్నట్టు తెలిపారు.ఎల్-3 నుంచి ఎల్-1 కేసులకు ఒకేసారి ప్రత్యేక అనుమతి కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. అర్హత ఉన్న నిర్మాణాల్లో నిధుల విడుదలకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సడలింపు ఒక్కసారి మాత్రమే వర్తిస్తుందని, భవిష్యత్తులో ఎల్-3 మంజూరుకు దీనిని ప్రాతిపదికగా పరిగణించరాదని స్పష్టంచేశారు.

## పనులు వేగంగా జరగట్లేదేం!?

- 24 గంటలూ పని చేయాల్సిందే
- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై సీఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్,సెప్టెంబర్-21 వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి గ్రీన్ చానల్‌లో నిధులు మంజూరు చేస్తున్నా పనులు వేగంగా ఎందుకు జరగడం లేదని అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే 30 రోజులూ 24 గంటలూ పనులు జరగాలని, ఆ మేరకు వర్క్ షెడ్యూల్ తయారు చేసుకుని ముందుకు వెళ్లాలని నిర్దేశించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంపై సోమవారం రాత్రి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎంవో అధికారులు నిరంతరం క్షేత్రస్థాయికి వెళ్లి సమీక్ష చేయాలని, ప్రత్యేక అధికారులను నియమించి పనులను పర్యవేక్షించాలని చెప్పారు. ప్రతి పనికి ఒక ప్రత్యేక అధికారికి బాధ్యత అప్పగించాలని, ఇక నుంచి ప్రతి రోజు కలెక్టర్ ఆస్పత్రి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు.

## జూరాల నీళ్లివ్వడానికి అభ్యంతరం ఎందుకు?



- కాంగ్రెస్ ఎంపీలకు భూములు, ఫామ్‌హౌస్‌లు లేవా...
- బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

వివరాలు 2లో..

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు
## హైకోర్టు నోటీసులు

స్పీకర్‌ను దూషించారన్న ఆరోపణల కేసులో..



హైదరాబాద్,సెప్టెంబర్-21
స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్‌ను దూషించారన్న ఆరోపణలతో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బీఆర్ ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు సూదన్, నవీన్ కుమార్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రిమాండ్‌ను తిరస్కరిస్తూ ఈనెల ఎనిమిదిన కింది కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ ఏసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మధు సూదన్ రావు సోమవారం విచారించారు. పీపీ వాదిస్తూ స్పీకర్ కులం తెలిసేలా కావాలనే అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలను రిమాండ్‌కు పంపేందుకు మెజిస్ట్రేట్

మిగతా 3లో..

### అంతరిక్ష రంగంలో
# చైనా దూకుడు..

- 45 గంటల్లో నాలుగు రాకెట్ ప్రయోగాలు..!



చైనా సెప్టెంబర్-21: అంతరిక్ష రంగంలో చైనా దూకుడు పెంచుతోంది. కేవలం 45 గంటల వ్యవధిలో నాలుగు రాకెట్లను విజయవంతంగా ప్రయోగించింది. మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి ఈ ప్రయోగాలు జరిగాయి. సెప్టెంబర్ 15, 16 తేదీల్లో చేపట్టిన ఈ ప్రయోగాల్లో ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు కంపెనీల రాకెట్లు కూడా ఉన్నాయి. మొదటి ప్రయోగం సెప్టెంబర్ 15న జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి జరిగింది.ల్యాండ్‌స్పేస్ సంస్థకు చెందిన జుక్యూ-2ఈ రాకెట్ 10 ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. క్వియాన్ ఫాన్ బ్రాడ్‌బ్యాండ్ మెగా శాటిలైట్ నెట్‌వర్క్ కోసం వీటిని పంపారు. ఈ నెట్‌వర్క్‌లో భవిష్యత్తులో దాదాపు 15 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. అదేరోజు షాంఘై సముద్ర తీరంలోని మొబైల్ ప్లాట్‌ఫామ్ నుంచి ఒరియెన్‌స్పేస్ గ్రావిటీ-1 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఇది మరో తొమ్మిది

మిగతా 3లో..

## మహిళ పట్ల దారుణంగా ప్రవర్తించిన హోంగార్డ్‌కు షాక్



- ఉద్యోగం నుంచి డిస్మిస్, వెంటనే అరెస్ట్

వివరాలు 2లో..

# ఉద్యమకారుడికి అండగా.. కేటీఆర్..



హైదరాబాద్,సెప్టెంబర్-21
కూకట్‌పల్లి షంషీగూడకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ ముదిరాజ్ (51) అడ్వాన్స్‌డ్ స్టేజ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం మాజీ కార్పొరేషన్ చైర్మన్ పాటిమీది జగన్ మోహన్ రావు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చిన్న వయసు నుంచే తెలంగాణ తల్లి వేషధారణలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న లక్ష్మణ్ కుమార్తె చంద్రికతో పాటు కుటుంబ సభ్యులతో ఇటీవల కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడి సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ భవన్‌లో లక్ష్మణ్ కుమార్తె, కుమారుడు కేటీఆర్‌ను కలిశారు. ఇప్పటికే బసవతారకం ఆసుపత్రిలో రెండు కీమోథెరపీలు పూర్తయ్యాయని తెలుసుకున్న కేటీఆర్ , తదుపరి చికిత్స గురించి ఆరా తీశారు. మెరుగైన వైద్యం కోసం అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్ అందుబాటులో ఉన్న సింధు హాస్పిటల్‌కు కేటీఆర్ రిఫర్ చేశారు. ఉద్యమకారుల కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. అలాగే ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ పాటిమీది జగన్ మోహన్ రావులను ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సకు అవసరమైన సహకారం అందించాలని కేటీఆర్ సూచించారు.

# ఆదివాసీలకు మరణ శిక్ష రద్దు చేయాలి

## హరగోపాల్



హైదరాబాద్,సెప్టెంబర్-21
ఛతీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జీరంఘాటి వద్ద 2013 మే 25న జరిగిన పరివర్తన ర్యాలీ కేసులో 10 మంది ఆదివాసీలకు ఎన్ఐఏ కోర్టు విధించిన మరణశిక్షను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం సీనియర్ నేత ప్రొఫెసర్ హరగోపాల్, ఇతర వక్తలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమాయక ఆదివాసీలకు ఉరిశిక్ష విధించడం అనాగరికమని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మరణశిక్ష ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ఆదివాసీల జీవన హక్కును గౌరవించాలని పేర్కొన్నారు. జల్-జంగల్-జమీన్‌పై హక్కుల కోసం ఆదివాసీలు పోరాడిన చరిత్రను విస్మరించరాదని తెలిపారు. మావోయిస్టు ఉద్యమం పేరుతో దేశవ్యాప్తంగా నమోదైన కేసులను పునఃసమీక్షించాలని, రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

# భూసేకరణ పూర్తిచేయాలి : ఉత్తమ్



హైదరాబాద్,సెప్టెంబర్-21 భూసేకరణ, పునరావాసం కోసం ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిన రూ.813 కోట్ల నిధులను జాప్యం లేకుండా సంబంధిత రైతులకు తక్షణం చెల్లించాలని సంబంధిత అధికారులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఉన్నతాధికారులు, కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ను మంత్రి ఉత్తమ్ సోమవారం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం, పరిహారం చెల్లింపుల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడు తూ.. భూసేకరణ, పునరావాస చెల్లింపులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, విడుదలైన నిధులు ప్రభుత్వ ఖాతాల్లో మూలుగుతుంటే సహించేది లేదని హెచ్చరించారు.

# బేగంపేటలో భారీ చోరీ..



హైదరాబాద్,సెప్టెంబర్-21
హైదరాబాద్‌లోని బేగంపేటలో భారీ చోరీ చోటు చేసుకుంది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉమానగర్‌లో నివసిస్తున్న శ్రీనాథ్ నాయుడు అనే వ్యక్తి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. ఇంట్లో భద్రపరిచిన 81 తులాల బంగారం, రూ.14.75 లక్షల నగదు కనిపించకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. శ్రీనాథ్ నాయుడు కుటుంబ సభ్యులు తమ ఇంట్లోని అల్మారాలో దాచిన నగదు, నగలు మాయమైనట్లు ఆలస్యంగా గుర్తించారు. వెంటనే పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తమ ఇంట్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను పోలీసులకు అందజేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు శ్రీనాథ్ నాయుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా ముగ్గురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ చోరీకి పాల్పడింది వారేనా లేక ఇతర వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు.

# మహిళ పట్ల దారుణంగా ప్రవర్తించిన హోంగార్డ్‌కు షాక్

- ఉద్యోగం నుంచి డిస్మిస్, వెంటనే అరెస్ట్



హైదరాబాద్,సెప్టెంబర్-21
హైదరాబాద్ హఫీజ్ పేట రైల్వే స్టేషన్ దగ్గర జరిగిన అమానుష ఘటనలో నిందితుడిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంది. హఫీజ్ పేట రైల్వే స్టేషన్ సమీపంలో ఓ భవనం వద్ద ఉన్న మహిళను ఓ వ్యక్తి అకారణంగా కొట్టి, జుట్టు పట్టుకుని రోడ్డుపై ఈడ్చుకుంటూ తీసుకెళ్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆ వీడియోలో మహిళను అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిని కూడా అతను పట్టించుకోలేదు.వీడియో వైరల్ కావడంతో అధికారులు వెంటనే స్పందించారు. దాడి చేసింది రైల్వే పోలీసు కాదని, తెలంగాణ పోలీస్ శాఖకు చెందిన హోంగార్డ్ అని తేలింది. నిందితుడిని వికారాబాద్ జిల్లాకు చెందిన హోంగార్డ్ ఆనంద్ గా గుర్తించారు. అతను డిప్యూటేషన్ పై హఫీజ్ పేట రైల్వే స్టేషన్ లో భద్రతా విధుల్లో ఉన్నాడు.ఘటనపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్ అయ్యారు. వెంటనే మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వికారాబాద్ ఎస్పీ స్నేహా మెహ్రా ఆదేశాలతో హోంగార్డ్ ఆనంద్ ను సర్వీసు నుంచి డిస్మిస్ చేశారు. అనంతరం అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు.రైల్వే శాఖ కూడా అతన్ని తిరిగి తెలంగాణ పోలీస్ శాఖకు పంపించేసింది.

# ‘దానం’ పిటిషన్ విచారణకు అనుమతి

## రేపు సుప్రీంకోర్టులో విచారణ



న్యూఢిల్లీ, సెప్టెంబర్-21
దానం నాగేందర్ పిటిషన్ విచారణకు అత్యున్నత న్యాయస్థానం అనుమతించింది. తెలంగాణ హైకోర్టు అనర్హత ఆదేశాల నేపథ్యంలో ఉప ఎన్నిక నోటిఫికేషన్‌పై ఆందోళనగా ఉందని దానం నాగేం దర్ తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గి సుప్రీంకోర్టుకు నివేదిం చారు. అందువల్ల ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. పార్టీ ఫిరాయించారన్న కారణంతో తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పును ఈనెల 19న దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ అనర్హత పిటిషన్‌పై విచారణ జరపాలని దానం నాగేందర్ తరపు ముకుల్ రోహిత్గి సోమవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. స్పీకర్ అనర్హత పిటిషన్‌ను తిరస్కరించగా, తెలంగాణ హైకోర్టు విచారించి అనర్హతా వేటు వేసిందని వివరించారు. ఉప ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని అందువల్ల అత్యవసరంగా విచారించాలని కోరారు. ‘రేపటి విచారణ జాబితాలో అత్యవసరంగా విచారించాలని కోరుతున్నాను. గత శుక్రవారం తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్ ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. ఇదే విషయంలో దానం నాగేందర్ పై పార్టీ ఫిరాయింపుల పిటిషన్‌ను స్పీకర్ తిరస్కరించారు. దానం నాగేందర్ తన పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నారు. కానీ.. పార్టీతో సంబంధం లేని వ్యక్తి (బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్) ఈ పిటిషన్ ను వేశారు’ అని ధర్మాసనానికి నివేదించారు. ఇది రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లోని అనర్హతకు సంబంధించినదని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం, స్పీకర్ ఖైరతాబాద్ ఖాళీ అని నోటిఫై చేస్తే ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసే ఆస్కారం ఉందన్నారు. అందువల్ల పిటిషన్‌ను నేడు (మంగళవారం) విచారణ చేపట్టాలని కోరారు. ప్రతివాదుల తరపు న్యాయవాదులు కూడా కోర్టు హాల్‌లోనే ఉన్నారని నివేదించారు. దీనిపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది మహేశ్ జఠ్మలాని స్పందిస్తూ, రేపు (బుధవారం) ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. అన్ని వైపుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, బుధవారం ఈ పిటిషన్‌ను విచారిస్తామని తెలిపింది. అయితే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న తాను 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినందుకు రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లోని పేరా 2(1)(ఎ) రెడ్ విత్ ఆర్టికల్ 191(2)కింద తనను హైకోర్టు అనర్హుడిగా ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఎమ్మెల్యే అనర్హత విషయంలో స్పీకర్ తీసుకొనే నిర్ణయా లను న్యాయస్థానాలు సమీక్షించడానికి వీలులేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# ఫీజీ వైద్య విద్య ఫీజులను తగ్గించాలి

- టీఏఎఫ్ఆర్‌సీకి హెచ్ఆర్‌డీఏ వినతి



హైదరాబాద్,సెప్టెంబర్-21
ప్రయివేటు మెడికల్ కళాశాలల్లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ (ఎమ్‌డీ, ఎమ్ఎస్) కన్వీనర్ కోటా (కేటగిరీ--ఏ) సీట్ల ఫీజులను తగ్గించి, హేతుబద్ధీకరించాలని హెల్త్‌కేర్ రీఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్. కార్తీక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహ్మద్ అజీత్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో ఈ మేరకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ) చైర్మెన్‌ను హెచ్ఆర్‌డీఏ ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. 2023--2026 బ్లాక్‌కు సంబంధించి ప్రయివేటు వైద్య కళాశాలల్లోని కన్వీనర్ కోటా/కేటగిరీ--ఏ పీజీ సీట్ల ఫీజులను పునఃసమీక్షించాలని వారు కోరారు. జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాలు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అమలవుతున్న ఫీజు నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకుని ఫీజులను తగ్గించి, సహేతుకంగా నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు.మెరిట్ ఆధారంగా పీజీ వైద్య సీట్లు పొందే విద్యార్థులకు ఫీజులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అధిక ఫీజుల కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే అర్హత కలిగిన విద్యార్థులు పీజీ వైద్య విద్యకు దూరం కాకుండా చూడాల్సిన అవసరముందని చెప్పారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పీజీ వైద్య విద్యలో పారదర్శకమైన, న్యాయసమ్మతమైన, అందుబాటులో ఉండే ఫీజు విధానం అమలు చేయాలని కోరారు.

# జనగణనలో ఓబీసీ కాలం చేర్చాలి

- గన్ పార్క్ వద్ద ధర్నాలో వక్తల డిమాండ్




హైదరాబాద్, సెప్టెంబర్ 21:
కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జాతీయ జనగణనలో ఓబీసీ కాలం చేర్చాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. జాతీయ ఓబీసీ కో-ఆర్డినేషన్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బీసీ పొలిటికల్ ఫ్రంట్ వైస్-చైర్మెన్ దుర్గయ్య గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ గన్ పార్క్ వద్ద పలు బీసీ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూధనాచారి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. కేంద్రం జనగణనలో ఓబీసీ కాలం చేర్చకుండా మొండి వైఖరి అవలంబిస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. దేశంలో అత్యధిక జనాభా కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు తలచుకుంటే అగ్రవర్ణ ప్రభుత్వాలు కుప్పకూలుతాయని, రాష్ట్రంలో త్వరలో వచ్చేది బహుజనుల రాజ్యమేనని హెచ్చరించారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ... ఓబీసీల జనాభాను లెక్కిస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీలు ఇచ్చి ఇప్పుడు మోసానికి పాల్పడ్డాయని విమర్శించారు. ఆ పార్టీల మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, ఇవి ఎంతో కాలం కొనసాగవని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్రం జాతీయ జనగణనలో ఓబీసీ కాలం చేర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, బీసీ మేధావుల ఫోరం చైర్మెన్ టి.చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మెన్ బాలగొని బాల్ రాజ్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ బి.ఎన్.రాములు, రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు వి.జి.ఆర్.నారగోని, బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్లు ఆయిలి వెంకన్న గౌడ్, అంబాల నారాయణ గౌడ్, బైరి శేఖర్, ఓబీసీ జాతీయ విద్యార్థి సంఘం అధ్యక్షులు కిరణ్ కుమార్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జూరాల నీళ్లివ్వడానికి అభ్యంతరం ఎందుకు?

- కాంగ్రెస్ ఎంపీలకు భూములు, ఫామ్‌హౌస్‌లు లేవా...
- బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర




హైదరాబాద్, సెప్టెంబర్ 21:
జూరాల నీళ్లను రైతులకు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అభ్యంతరం ఎందుకని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అడిగారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జూరాల నీళ్లు ఇవ్వమని అడిగితే బీఆర్ఎస్ నాయకులను పోలీసులు నిర్బంధించడం సరైంది కాదన్నారు.వైఖరి మారకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని హెచ్చరించారు. రాష్ట్రంలో అసమర్థ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేసిందని చెప్పారు. బీసీలకు మంత్రి పదవుల్లోనూ ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. రైతులకు యూరియా ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. 22ఏ అంశంలో రైతులు, బీసీలు ఎక్కువ ఇబ్బంది పడుతున్నారని వివరించారు.తెలంగాణ విభజనను ఇండియా, పాకిస్తాన్‌తో పోల్చినా కాంగ్రెస్ ఎంపీలు మాట్లాడలేదని చెప్పారు. హనీమూన్ లాగా ఇక్కడ ఎంపీలు బస్సులు వేసుకుని తిరుగుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎంపీలకు భూములు, ఫామ్‌హౌస్‌లు లేవా?అని ప్రశ్నించారు.జెన్ జీ విద్యార్థులు కేంద్రమంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారని గుర్తు చేశారు. పోలీసులు అతిగా వ్యవహరించొద్దని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలు, రైతులను పోలీసులు నిర్బంధించారని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ద్రోహి అని విమర్శించారు. 9తెలంగాణ ఉద్యమంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా పారిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు పాల్గొన్నారు.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# (మొదటిపేజీ తరువాయి)

## సాగునీటి కోసం రైతుల ఆందోళన

విడుదల చేశారు. దీంతో అధికారులు అర్ధరాత్రి తిరిగి గేట్లు మూసివేశారు. ఈ నేపథ్యంలో జూరాల ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జూరాల ప్రాజెక్టు ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి జూరాలకు బయలుదేరారు. నందిమల్ల వద్ద పోలీసులు ఆయనను అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. దీంతో రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని నిరసన తెలిపేందుకు రైతులతో కలిసి వెళ్లడం నేరమా అంటూ చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రైతులు, బీఆర్ఎస్ శ్రేణుల్ని పోలీసులు అరెస్టు చేయడంతో అక్కడ కొద్దిసేపు తోపులాట చోటుచేసుకుంది. ఆందోళన సందర్భంగా చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టులో నీళ్లున్నా ఆయకట్టుకు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. రైతుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. జూరాల ప్రాజెక్టులో తొమ్మిది టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, సాగు చేసిన పంటలు ఎండిపోతున్నందున సాగునీటి అవసరాల కోసం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాగునీటి అవసరాలకు రెండు టీఎంసీలు సరిపోతాయని, మిగిలిన ఏడు టీఎంసీలను సాగునీటికి ఎందుకు విడుదల చేయడంలేదని ప్రశ్నించారు. రైతుల పంటల్ని కాపాడేందుకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని కోరారు. జూరాల డ్యామ్ వ్యవసాయం కోసం కట్టిందని, తాగునీటి కోసం కాదని స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ జిల్లాకు తాగునీరు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వస్తుందని తెలిపారు. జూరాల నుంచి తాగునీరు వాడకూడదనే విషయాన్ని మంత్రి తెలుసుకోవాలని సూచించారు. మంత్రికి శక్తి ఉంటే కర్నాటక ప్రభుత్వంతో మాట్లాడి నీటిని తీసుకురావాలని హితవు పలికారు. గతంలో నీటి కొరత వచ్చినప్పుడు మక్తల్ పట్టణం పక్కన ఉన్న సంఘం బెండ నుంచి నీళ్లు తీసుకొచ్చి ఇక్కడి రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. ఎల్‌నినో పేరు చెప్పి ప్రభుత్వం ఎన్ని రోజులు తప్పించుకుంటుందని ప్రశ్నించారు. పంట చేతికి వచ్చే సమయంలో నీటిని నిలిపివే యడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళ నలో ఉన్నారన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పే కాంగ్రెస్ రైతుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడంలేదని విమర్శించారు. రైతుల ఆందోళన నేపథ్యంలో జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ, ఎస్సైలు, పోలీసులు ఏఆర్ సిబ్బందితో నిరంతర పహారా కాస్తున్నారు. ప్రాజెక్టు వైపు వెళ్లే అన్ని రహదారుల్లో వాహన తనిఖీలు చేపట్టారు. జూరాల చుట్టూ పోలీసు బలగాలు మోహరించాయి.

## పార్టీ శ్రేణుల అణచి వేతకు రాష్ట్ర సర్కారు కుట్ర

ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం నీరు తీసుకెళ్తుంటే ఇక్కడ నికర జలాలపై నిర్మించిన ప్రాజెక్టుల కింద కూడా నీరు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ ఏడాది వచ్చిన 248 టీఎంసీల కృష్ణా జలాల్లో తెలంగాణ కేవలం 28 టీఎంసీలు మాత్రమే వాడిందని వివరించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డి పాలమూరు రైతులకు మొదటి శత్రువులా తయారయ్యారని అన్నారు. ఎల్‌నినో తరహాలో ఎల్ కాంగో వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. రైతుల కోసం వెళ్లిన బీఆర్ఎస్ నేతలను దుర్మార్గంగా పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో భయటపెట్టలేరని అన్నారు. జూరాల కింద ఒక్క ఎకరం పంట ఎండినా కాంగ్రెస్ ప్రభుత్వానిదే బాధ్యత అని చెప్పారు. ప్రభుత్వ వైఖరి మార్చుకోకుంటే పెద్ద ఉద్యమానికి శ్రీకారం చుడతామనీ, ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాలు కాకుండా రైతుల ప్రయోజనాలు ముఖ్యం కావాలని సూచించారు. రైతుల విషయంలో రాజకీయం చేయొద్దని కోరారు. కన్నెపల్లి, నార్లాపూర్ పంపులను వెంటనే ఆన్ చేయాలని డిమాండ్ చేశారు. కర్నాటక ప్రభుత్వంతో మాట్లాడి పది టీఎంసీల నీరు తీసుకొచ్చి పంటలను కాపాడాలని చెప్పారు. తాము ఏమైనా తప్పులు చేసి ఉంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి చర్యలు అయినా తీసుకోవచ్చని అన్నారు. డ్రామాలు తగవనీ, భూముల వద్దకు వెళ్లి ఏం చేస్తారని ప్రశ్నించారు.ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమని సవాల్ చేస్తే ఇప్పటి వరకు కనీసం స్పందన లేదని అన్నారు. సిరిసిల్ల వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చెప్తారని ప్రశ్నించారు. నేతన్నల ఆత్మహత్యలు, రైతుబంధు ఎగ్గొట్టింది వివరిస్తారా?అని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో చేసిన అభివృద్ధిని చూసి కొడంగల్‌లో అమలు చేసేందుకు వస్తున్నారేమోనని అన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టు సిరిసిల్లలో ఎనిమిది వేల ఎకరాల భూమిని ఎవరు కబ్జా చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తప్పుడు ఆరోపణలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిన రేవంత్ రెడ్డి రాజన్న దర్శనం చేసుకుని పాప ప్రక్షాళన చేసుకోవాలని సూచించారు.

## బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టు దుర్మార్గం

గుండెపగిలిన రైతులు జూరాల గేట్లు ఎత్తే ప్రయత్నం చేస్తే, వారిపై అక్రమ కేసులు బనాయించి ప్రభుత్వం అన్నదాతలను అన్నివిధాలా అరిగోస పెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.తాగునీటికి కేవలం రెండు టీఎంసీలు సరిపోతాయని తెలిసినా, 9 టీఎంసీలున్న జూరాల నుంచి చుక్క నీరు విడుదల చేయకుండా ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులను సంక్షోభంలోకి నెట్టడం క్షమించరాని పాపమని వెల్లడించారు. అక్రమంగా అరెస్టుచేసిన బీఆర్ఎస్ నేతలను ప్రభుత్వం విడుదల చేయడంతోపాటు జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే రిలీజ్ చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి కాంగ్రెస్ సర్కారు కుప్పకూలడం ఖాయమని హెచ్చరించారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు హైకోర్టు నోటీసులు

నిరాకరించడం చట్ట వ్యతిరేకమన్నారు. పలువురు సాక్షుల వాంగ్మూలాలతోపాటు వీడియో ఫుటేజీలను సేకరించి కోర్టుకు సమర్పించినప్పటికీ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ప్రత్యేక కోర్టు పరిధిలో ఉన్నందున మెజిస్ట్రేట్ రిమాండ్‌ను తిరస్కరించలేరని చెప్పారు. ఆ ఉత్తర్వులను రద్దు చేసి ఎమ్మెల్సీల రిమాండ్‌కు ఆదేశించాలన్నారు. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది.

## అంతరిక్ష రంగంలో చైనా దూకుడు..

క్వియాన్‌ఫాన్ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది.ఘన ఇంధనంతో పనిచేసే ఈ రాకెట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సాలిడ్ ఫ్యూయల్ రాకెట్‌గా గుర్తింపు పొందింది. మూడో ప్రయోగం హైనాన్ దీవిలోని వెన్‌చాంగ్ కేంద్రం నుంచి జరిగింది. ప్రభుత్వ రంగానికి చెందిన లాంగ్ మార్చ్-12 రాకెట్ తొమ్మిది ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపింది. ఇవి సాట్‌నెట్ పేరుతో ఏర్పాటు చేస్తున్న మరో భారీ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ కోసం ఉద్దేశించినవి. ఇందులో దాదాపు 13 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టే ప్రణాళిక ఉంది.నాలుగో ప్రయోగంతో ఈ వరుస ముగిసింది. జియుక్వాన్ నుంచి కుయ్‌జౌ-11 రాకెట్ రెండు రాడార్ భూ పరిశీలన ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. మొత్తంగా నాలుగు ప్రయోగాల్లో 30 ఉపగ్రహాలను చైనా కక్ష్యలోకి పంపింది. ఈ నాలుగు ప్రయోగాలు చైనా అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల పాత్ర పెరుగుతున్న విషయాన్ని కూడా చూపించాయి. అయితే ఈ నాలుగు ప్రయోగాల్లో ఏ రాకెట్ బూస్టర్‌ను తిరిగి భూమికి తీసుకురాలేదు. కాగా జుక్యూ-3, లాంగ్ మార్చ్-10 బీ రాకెట్ల తొలి దశలను విజయవంతంగా ల్యాండ్ చేసి పునర్వినియోగ సాంకేతికతలో చైనా ముందడుగు వేసింది.

## ఇందిరమ్మ టవర్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మరో శుభవార్త!



హైదరాబాద్, సెప్టెంబర్ 1: తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళ పథకం ద్వారా ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తున్న విషయం తెలిసిందే. ఇక నగరంలోనూ ముఖ్యంగా క్యూర్ పరిధిలో ఇల్లు లేని, సొంతింటి స్థలం కూడా లేని నిరుపేదలకు ఇల్లు ఇవ్వాలని సంకల్పించిన తెలంగాణా సర్కార్ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేసి వారికి ఇవ్వనుంది. ఈ క్రమంలో ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారికి ఇందిరమ్మ టవర్స్ దరఖాస్తుల పరిశీలనతో పాటు లాటరీ ద్వారా ఫ్లాట్ లను కేటాయిస్తున్నారు. అయితే తాజాగా ఇందులో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిశీలనలో ఇబ్రహీంపట్నం, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో స్థానికుల సంఖ్య ఇళ్ల కేటాయింపుకు సరిపోకపోవడం గుర్తించారు.దీంతో మిగిలిన ఇళ్ల కోసం స్థానికులుగా నిర్ధారణైన దరఖాస్తుదారులతో మరోసారి లాటరీ నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. కూకట్‌పల్లిలో కూడా తగిన స్థానికులు లేకపోతే మరో డ్రా చేసే అవకాశం ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ఒక్కో నియోజకవర్గానికి 600 మంది చొప్పున 480 మంది ప్రధాన జాబితా, 120 మంది వెయిటింగ్ లిస్ట్‌లో ఎంపికయ్యారు. అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఎంపిక కాని వారికి దరఖాస్తు సమయంలో చెల్లించిన రూ.10 వేలు ప్రభుత్వం రిఫండ్ చేస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో తుది జాబితా ఖరారు కాకపోవడంతో రిఫండ్ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. దరఖాస్తులో నియోజకవర్గ వివరాలు తప్పుగా నమోదు చేసిన వారికి ఈ నెల 25 వరకు ఆన్‌లైన్‌లో సవరణకు అవకాశం కల్పించారు. అప్లికేషన్ నంబర్, ఫోన్ నంబర్ లేదా ఆధార్ వివరాలతో లాగిన్ అయి మార్పులు చేసుకోవచ్చు. ఎంపికైన వారికి సోమవారం నుంచి వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా అలాట్‌మెంట్ లెటర్లు పంపనున్నారు. అధికారిక వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టీజీహెచ్‌బీ తెలిపింది. స్థానికులకు మరోసారి అవకాశం దక్కే అవకాశం ఉండటంతో మరోసారి లాటరీలో రానివారు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

# హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ క్లౌడ్ రీజియన్

- అధికారికంగా ప్రారంభించిన సంస్థ
- భారత్‌లో కంపెనీకిది నాలుగో కేంద్రం

న్యూఢిల్లీ,సెప్టెంబర్21: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. భారత్‌లో తన నాలుగో క్లౌడ్ రీజియన్‌ను హైదరాబాద్‌లో సోమవారం అధికారికంగా ప్రారంభిం చింది. భారత్‌లో డిజిటల్, కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక వసతుల అభివృద్ధి కోసం కంపెనీ గతంలో ప్రకటించిన 2,050 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.95 లక్షల కోట్లు) పెట్టుబడుల ప్రణాళికలో భాగంగా మైక్రోసాఫ్ట్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కంపెనీకి భారత దక్షిణ మధ్య క్లౌడ్ రీజి యన్ అయిన ఈ కేంద్రం.. గత నెల 6వ తేదీనే అందుబాటులోకి వచ్చింది. మైక్రోసాఫ్ట్ ఇప్పటికే పుణె, చెన్నై, ముంబైలో క్లౌడ్ రీజియన్‌లను ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పాటు చేసిన హైదరాబాద్ క్లౌడ్ రీజియన్‌లో కూలింగ్ కోసం నీటికి బదులు ఎయిర్ కూల్డ్ చిల్లర్స్‌పై ఆధా రపడుతున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ తెలిపారు. దేశంలో అతిపెద్ద హైపర్‌స్కేల్ క్లౌడ్ సేవల కేంద్రం ఇదేనని ఆయన అన్నారు. హైదరా బాద్ క్లౌడ్ రీజియన్‌ను మైక్రోసాఫ్ట్ మూడు జోన్ల ఆర్కిటెక్చర్‌తో అభివృద్ధి చేసింది. మిషన్ క్రిటికల్, ఏఐ వర్క్‌లోడ్స్‌కు మద్దతిచ్చేలా డిజైన్ చేసింది. భారత్‌లోని తమ అన్ని డేటా సెంటర్లు ఏఐ ఎనేబుల్డ్, ఏఐ క్యాపబుల్ హార్డ్‌వేర్, అధిక సామర్థ్యంతో కూడిన కూలింగ్ వ్యవస్థలను కలిగి ఉండ టంతోపాటు ఆధునిక ఏఐ వర్క్‌లోడ్స్ నిర్వహణకు అనుకూ లంగా ఉన్నాయని మైక్రోసాఫ్ట్ తెలిపింది. హైదరా బాద్ కేంద్రంలో అదనంగా అజుర్, ఏఐ సేవలందించే ఆలోచన ఉందని సంస్థ వెల్లడించింది.భారత్‌లో భవిష్యత్ డేటా సెంటర్లను విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు సమీపంలో ఏర్పాటు చేయాలని మైక్రోసాఫ్ట్‌ను కేంద్ర ప్రభుత్వం కోరింది. తద్వారా కంపెనీతోపాటు ప్రభుత్వానికి ఖర్చులు తగ్గుతా యని హైదరాబాద్ క్లౌడ్ రీజియన్‌ను ప్రారంభించిన సంద ర్భంగా కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ కార్యదర్శి ఎస్ కృష్ణన్ అన్నారు. కృత్రిమ మేధ సాంకేతికత భద్రతపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ ప్రెసి డెంట్ చందోక్ కీలక వ్యాఖ్యలు చేశారు. మానవ సేవ కోసం మాత్రమే ఏఐని అభివృద్ధి చేయాలని,ఈసాంకేతి కతపై నియంత్రణ ఎల్లప్పుడూ మన చేతుల్లోనే ఉండాలని మైక్రోసాఫ్ట్ గట్టిగా నమ్ముతుందన్నారు.

## కేటీఆర్‌కి కోట్ల ఆస్తులు మీకు ఎలా వచ్చాయి

- ఎంపీ చామల సూటి ప్రశ్న..



హైదరాబాద్, సెప్టెంబర్ 1: తెలంగాణ రాజకీయాల్లో భూములు, ఫామ్‌హౌస్‌ల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావుకు సంబంధించినవిగా ఆరోపిస్తున్న అజీజ్ నగర్ భూములను కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం ఆదివారం ఫీల్డ్ విజిట్ చేపట్టింది. ప్రజా భవన్ నుంచి బయలుదేరిన నేతలు తొలుత అజీజ్ నగర్‌లోని ఫామ్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మొయినాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి సంబంధించిన ఫామ్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలించనున్నారు. ఈ బృందంలో ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ యాదవ్, మల్లు రవి, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ రెడ్డి మాట్లాడుతూ.. 'సిద్దిపేట రంగనాయక్ సాగర్‌లో బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు ఫామ్‌హౌస్ కట్టుకున్నారు. సిద్దిపేటలో లావోని పట్టా భూములను ఆయన బదిలీ చేసుకున్నారు. నేడు అజీజ్ నగర్ ఫీల్డ్ విజిట్‌కి వచ్చాము. తమ ఆస్తులు పూర్వీకుల నుంచి వచ్చాయని కేటీఆర్ అంటున్నారు. తాము ఆగర్భ కోటీశ్వరులమని ఆయన చెబుతున్నారు. వారిది చింతమడక.. ఫామ్‌హౌస్‌లు ఉన్నవి జన్వాడ, ఎర్రవల్లి, అజీజ్ నగర్. ఈ ఆస్తులన్నీ మీ తాతల ఆస్తులని చెబుతున్నారా?.. మేము డైవర్షన్ పాలిటిక్స్ చేయడం లేదు. సీఎం రేవంత్ ఆన్ రికార్డ్ శాసనసభలో చెప్పిన అంశాలను ప్రజలకు చెబుతున్నాం. జీవో 111 రూల్స్‌ను తుంగలో తొక్కి జన్వాడ, అజీజ్ నగర్‌లో నిర్మాణాలు చేశారు.కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద 300 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. గత పదేళ్లుగా దళితులకు పట్టాలు ఎందుకు ఇవ్వలేదు?, దోచుకోవాలనే ఉద్దేశంతోనే పట్టాలు ఇవ్వలేదు. పేద ప్రజలను అడ్డుపెట్టుకుని సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని కేసీఆర్ భావించారు. మీ ఆస్తుల వివరాలు అఫిడవిట్‌లో ఎందుకు వెల్లడించలేదు?. కేటీఆర్.. ఎమ్మెల్యేగా మీ జీతం ఎంత?. మీకు కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయి?. 1,600 మంది బలిదానంతో కోట్ల ఆస్తులు కూడబెట్టారు. మేము ప్రైవేట్ ప్రాపర్టీస్ వద్దకు వెళ్లడం లేదు.. మేము అడిగే వాటికి కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

## బాలికపై లైంగిక వేధింపులు..

- కలకలం రేపుతున్న మంత్రి వ్యాఖ్యలు..



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21: బిహార్‌లోని జమయి జిల్లాలో బాలికపై వేధింపుల ఘటన తీవ్ర కలకలం రేపుతున్న సంగతి తెలిసిందే. పదో తరగతి చదువుతున్న ఓ బాలుడు, బాలిక కోచింగ్ క్లాసుల నుంచి తిరిగి వస్తుండగా ఓ మూక వారిని అడ్డుకుని తీవ్రంగా వేధించింది. బాలుడిపై దాడి చేసి, బాలికను లైంగికంగా వేధించడం పెను సంచలనం సృష్టిస్తోంది. అయితే, ఈ ఘటనపై ప్రతిపక్షాలు మండిపడుతుండగా.. బిహార్ మంత్రి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి.ఈ ఘటనపై మంత్రి శ్రావణ్ కుమార్ స్పందిస్తూ.. ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయని పేర్కొన్నారు. 'ఇలాంటి చెదురుమదురు సంఘటనలు జరుగుతాయన్న విషయాన్ని కాదనలేం. ప్రపంచంలో నేరాలు అంతం కాలేదు' అని అన్నారు. అయితే, ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. జేడీయూ నాయకుడు ఉమేశ్ కుష్వాహా కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. వారి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. అధికారంలో ఉండి ఇలాంటి మాటలు మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించాయి. అయితే, దీనిపై మంత్రి వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. 'కొన్నిసార్లు నోరు జారినప్పుడు అలాంటి వ్యాఖ్యలు బయటకు వస్తాయి, కానీ ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. గతంలో చర్యలు తీసుకున్నాం, భవిష్యత్తులోనూ తీసుకుంటాం' అని తెలిపారు. కాగా, సెప్టెంబర్ 19న రాత్రి జమయి-లఖిసరాయ్ రోడ్డు సమీపంలోని మద్వా పహాడ్ ప్రాంతంలో ఈ అమానుష ఘటన చోటుచేసుకుంది. ఇద్దరు విద్యార్థులపై అల్లరి మూక దాడికి తెగబడింది. కోచింగ్ క్లాసుల నుంచి ఇంటికి వెళ్తుండగా ఓ గుంపు వారిని అడ్డుకుని.. బాలికను అసభ్యకరంగా తాకుతూ లైంగికంగా వేధించింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్ల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమయ్యింది. ఈ వీడియో పోలీసుల దృష్టికి వెళ్లడంతో పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇప్పటివరకూ ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా.. మరో ఆరు, ఏడుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనపై బిహార్ ప్రభుత్వం సిట్ కూడా ఏర్పాటు చేసింది.

## గణేష్ అన్నదానం వద్ద బీఫ్ ముక్కలు కలకలం..!

తీవ్ర ఉద్రిక్తత..





హైదరాబాద్, సెప్టెంబర్ 1: హైదరాబాద్ వ్యాప్తంగా ప్రస్తుతం ఎక్కడ చూసిన గణేష్ నిమజ్జనాలు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రజలు ఉత్సాహంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అయితే ఓల్డ్ సిటీ పరిధిలోని మాదన్నపేట్ లో నిర్వహించిన గణేష్ అన్నదానం కార్యక్రమంలో తీవ్ర అపచారం జరిగింది. మాదన్నపేట్ పీఎస్ పరిధిలోని 2 బీహెచ్ కే హౌజింగ్ సొసైటీ వద్ద నిర్వహించిన గణేష్ అన్నదానంలో గుర్తు తెలియని వ్యక్తులు మాంసం వేయడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనతో తీవ్ర ఆగ్రహానికి గురైన స్థానికులు, భక్తులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకుని నిరసనకు దిగారు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే నేతృత్వంలో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు స్పష్టం చేశారు. అయితే అదే హౌజింగ్ సొసైటీలో నివాసం ఉంటున్న మహమ్మద్ ఇమ్రాన్ ఖురేషీ, అర్షియా బేగం, సమీనా అనే ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుతం నిందితుల్ని రిమాండ్ కు తరలిస్తున్నామని.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని డీసీపీ కిరణ్ ఖరే స్పష్టం చేశారు. ఇక ఈ ఘటనతో స్థానికులు, హిందూ సంఘాలు పెద్ద ఎత్తున ఘటనాస్థలికి తరలివచ్చి ఆందోళన చేశారు. మతపరమైన ప్రదేశాల్లో నాన్ వెజ్ పదార్థాలను పడేయడం తమ భావోద్వేగాలను దెబ్బతీయడమేనని తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే వారితో మాట్లాడి పరిస్థితిని సామరస్యంగా సద్దుమణిగించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ట్రాఫిక్ యథాతథంగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ప్రజలు సోషల్ మీడియాలో ఈ మేరకు ఎలాంటి పుకార్లు నమ్మొద్దని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని ప్రచారం చేయొద్దని వివరించారు. అయితే ప్రస్తుతం ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## నీటిపారుదల ప్రాజెక్టుల నిధుల విడుదలపై శుభవార్త!

హైదరాబాద్, సెప్టెంబర్ 1: రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల నిధుల విడుదలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుభవార్త చెప్పారు. నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం-పునరావాస పునరుద్ధరణ పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నేడు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. 2026-27ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.1,050కోట్లు, మరోసారి రూ.1,500కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం రూ.2,550 కోట్లు విడుదలైన నిధుల్లో అధిక భాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి, లబ్ధిదారులకు చేరకపోవడం ఆందోళనకరమని అన్నారు. జిల్లా కలెక్టర్లు భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.నిధులు సరిపోకపోయినా, ఇతర కారణాల వల్ల చెల్లింపులు సాధ్యం కాకపోయినా ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. విడుదలైన నిధులను అధికారుల వద్ద ఉంచి పనులను పెండింగ్‌లో పెట్టవద్దని స్పష్టం చేశారు. భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు.నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పురోగతిని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ఇప్పటికే విడుదలైన రూ.2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ నిబంధనల ప్రకారం జరగాలని, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పరిహారం మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ముఖ్యమంత్రి బడ్జెట్‌కు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులు సమకూర్చి మంజూరు చేస్తున్నందున అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని భూసేకరణ పనులను పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు.

## తెలంగాణా ప్రజలకు శుభవార్త..

దసరా నుండి గ్రామాలకు మహర్దశ!



హైదరాబాద్, సెప్టెంబర్ 1: తెలంగాణలో గ్రామాల వారికి శుభవార్త. గ్రామాల అభివృద్ధికి కావాల్సిన అన్ని కీలక నిర్ణయాలను తీసుకుంటోంది. గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికే కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పరిధిలో ఎంపికైన రోడ్ల పనులను దసరా పండుగకు ముందే ప్రారంభించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. తాజాగా సెక్రటేరియట్ లో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క ఈ విషయంపై మాట్లాడారు. హ్యామ్ పద్ధతిలో ఎంపికైన ప్యాకేజీలకు సంబంధించి కాంట్రాక్టర్ సంస్థలు వెంటనే పనులు మొదలుపెట్టేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. పనులు ప్రారంభించడమే కాకుండా, నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సీతక్క తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు మెరుగుపడితే మండలాలు, జిల్లా కేంద్రాలకు ప్రజల రాకపోకలు సులభం అవుతాయని, అలాగే రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు త్వరగా తరలించుకునే అవకాశం పెరుగుతుందని మంత్రి సీతక్క వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక గ్రామాల్లో రోడ్లు గుంతలతో నిండి ఉన్నాయి. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, కొన్ని చోట్ల మట్టి రోడ్లుగా మారిపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. దీని వల్ల ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు, సరుకు రవాణా వాహనాలు ఇబ్బందులు పడుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు కూడా సకాలంలో చేరుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. కొత్త రహదారుల నిర్మాణం పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడంతో పాటు వాహనాల నిర్వహణ ఖర్చు కూడా తగ్గుతుంది. గ్రామీణ ఆర్థిక కార్యకలాపాలకు, చిన్న వ్యాపారాలకు, సేవా రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయి. మంత్రి సీతక్క జీరాంజీ నిధులతో నిర్మిస్తున్న పంచాయతీ భవనాలు, గ్రామ సమాఖ్య భవనాలు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాలను కూడా సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ భవనాల కోసం అదనపు నిధులు సేకరించేందుకు ఎంపీ లాడ్స్ నిధులను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి ఎంపీ కనీసం ఒక కోటి రూపాయలు కేటాయించేలా త్వరలో లేఖలు రాస్తానని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కూడా ఆదేశించారు. హ్యామ్ రోడ్లు పూర్తయితే గ్రామాల అభివృద్ధి సాధ్యం అవుతుంది.

# బీమా రంగంలోనూ యూపీఐ

## ● పబ్లిక్ ఇన్సూరెన్స్ రిజిస్ట్రీకి ఐఆర్‌డీఏఐ కసరత్తు




న్యూఢిల్లీ : భారత బీమా రంగంలో సమూల మార్పులు తెచ్చేందుకు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) ప్రయత్నాలు ముమ్మరం చేసింది. డిజిటల్ పేమెంట్స్ రంగంలో యుపిఐ సంచలనం సృష్టించినట్లే.. బీమా రంగంలోనూ పారదర్శకతను పెంచేందుకు ప్రతిపాదిత పబ్లిక్ ఇన్సూరెన్స్ రిజిస్ట్రీ (పీఐఆర్) తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఐఆర్‌డీఏఐ ఇటీవల ఒక సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసింది. పాలసీదారులకు అన్ని బీమా వివరాలు ఒకే చోట లభించడం, సులభంగా కేవైసీ పూర్తి చేయడం, క్లెయిమ్ చరిత్ర అందుబాటులోకి రావడం వంటి ప్రయోజనాలు ఈ వ్యవస్థ ద్వారా చేకూరుతాయి. జీ-20 డీపీఐ మార్గదర్శకాల ఆధారంగా రూపొందిస్తున్న ఈ ఫెడరేటెడ్ ఆర్కిటెక్చర్ విధానం వల్ల డేటా భద్రతకు ఎటువంటి భంగం కలగకుండా పాలసీదారులకు, బీమా సంస్థలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ వ్యవస్థ ద్వారా సమాచారమంతా ఒకే చోట కేంద్రీకృతం కాకుండా డేటా ఎక్కడ సేకరించబడిందో అక్కడే సురక్షితంగా ఉండేలా ఫెడరేటెడ్ ఆర్కిటెక్చర్‌ను అవలంబిస్తున్నారు. దీని ద్వారా పాలసీదారులకు జీవిత, ఆరోగ్య, మోటార్ , ఆస్తి బీమాలకు సంబంధించిన అన్ని పాలసీల వివరాలు ఒకే చోట కనిపిస్తాయి. నామినీలు, రెన్యూవల్స్, క్లెయిమ్‌లు సులభంగా పర్యవేక్షించవచ్చు. పాలసీల మార్పిడి (పోర్టబిలిటీ) మరింత సులభమవుతుంది. బీమా కంపెనీలకు పాలసీలు, క్లెయిమ్ చరిత్ర పారదర్శకంగా లభించడం వల్ల అండర్‌రైటింగ్ ఖచ్చితత్వం పెరుగుతుంది. మోసాలను అరికట్టడానికి వీలవుతుందని ఐఆర్‌డిఎఐ వర్గాలు భావిస్తున్నాయి. బ్యాంకులు, ప్రభుత్వాలకు కూడా వెరిఫైడ్ కవరేజ్ డేటా అందుబాటులోకి రావడం వల్ల రుణాల మంజూరు, సంక్షేమ పథకాల అమలు మరింత సులభమవుతుంది.ప్రస్తుతం బీమా రంగంలో పాలసీదారులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒకే వ్యక్తి వివిధ బీమా సంస్థల నుంచి పాలసీలు తీసుకున్నప్పటికీ ప్రతిసారీ కేవైసీ ప్రక్రియను విడివిడిగా పూర్తి చేయాల్సి వస్తోంది. అలాగే, క్లెయిమ్ చరిత్ర అందుబాటులో లేకపోవడం వల్ల అండర్‌రైటింగ్‌లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.అంతేకాకుండా వినియోగదారులు తమకు నచ్చిన బీమా పాలసీని సులభంగా పోల్చుకునే అవకాశం లేక, ఏజెంట్లు చెప్పే మాటల మీదే ఆధారపడాల్సి వస్తోంది. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టి బీమా చేయడం అనే పద్ధతి నుంచి వినియోగదారుడే స్వయంగా బీమా కొనుగోలు చేసే స్థాయికి మార్చడమే ఈ రిజిస్ట్రీ ప్రధాన ఉద్దేశం. ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరోను పూర్తిగా ఐఆర్‌డీఏఐ యాజమాన్యంలోని లాభాపేక్ష లేని సంస్థగా పునర్వ్యవస్థీకరించాలని ప్రతిపాదించారు. పాలసీదారుల సమాచార భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ దశలవారీగా ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేయాలని భావిస్తున్నారు. ఈ నూతన విధానం ద్వారా బీమా రంగంలో పారదర్శకత పెరిగి రాబోయే రోజుల్లో బీమా వ్యాప్తి గణనీయంగా పుంజుకుంటుందని అంచనా వేస్తున్నారు.

# దూసుకొస్తున్న తీవ్ర వాయుగుండం

## ● 24 గంటల్లో అతి భారీ వర్షాలు....!

**అమరావతి,సెప్టెంబర్ 21:** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోంది. ఇది మరో 24 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని ఏపీలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటిం చిం ది. ఆ తదుపరి 24 గంటలకు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా బలోపేతం కానుందని అధికారులు వెల్లడించారు. ఇది ఎల్లుండి ఉదయానికి దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.అల్పపీడనం నుంచి వాయుగుండానికి మారుతున్న ప్రభావంతో నేడు, రేపు చెదురుమదురుగా భారీ వర్షాలు ఉంటాయని ఆయన తెలిపారు. బుధ, గురువారాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఇవాళ అల్లూరి, పోలవరం, నంద్యాల, కడప జిల్లాల్లో అక్కడక్కడ పిడు గులతో కూడిన మోస్తరు వర్షాలు ఉంటాయన్నారు. మిగతా జిల్లాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. కోస్తా తీరం వెంబడి 50-60కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని కూడా పేర్కొన్నారు.వాయుగుండం పరిస్థితుల నేపథ్యంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచిస్తోంది. అలాగే సముద్రం తీవ్ర అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని హెచ్చరికలు జారీచేస్తోంది. ఈ నేప థ్యంలో ప్రభుత్వం కూడా తీర ప్రాంతాల్లో అధికారుల్ని అప్రమత్తం చేస్తోంది. వర్షాల ప్రభావం నేపథ్యంలో సిబ్బంది అందుబాటులో ఉండాలని కోరుతోంది.

# ట్రంప్ తగ్గేదే లేదు

## మీడియాలో పాజిటివ్ కవరేజ్ లేదని ఏకంగా టీవీనే లాంచ్ చేశాడు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:** అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్ హౌస్ లో నిర్వహించే ప్రెస్ కాన్ఫరెన్స్, ఇతర అధికారిక కార్యక్రమాలను కవర్ చేసే విషయంలో కొన్ని మీడియా సంస్థలపై నిషేధం విధించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సీఎన్ఎన్, ఎంఎస్ నౌ, పొలిటికో వంటి టాప్ మీడియా గ్రూప్ లకు వైట్ హౌస్ ప్రవేశ అనుమతులను రద్దు చేసిన తరుణంలో తాజా వ్యూహాత్మక పరిణామం చోటుచేసుకుంది. ఈ మూడ సంస్థలు కూడా కోర్టుకెక్కాయి. తమకు కనీస సమాచారం ఇవ్వకుండా, సంజాయిషీ చెప్పుకొనే అవకాశం కల్పించకుండా ఏకపక్షంగా ఎంట్రీ పాస్ లను జప్తు చేశారని కోర్టులో పిటిషన్ వేశాయి. ఈ పరిణామాల మధ్య వైట్ హౌస్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఏకంగా ట్రంప్ పేరుతో ఓ టీవీ నెట్ వర్క్ నే లాంచ్ చేసింది. 'ట్రంప్ టీవీ: ది ఎస్సెన్షియల్స్ స్టేషన్..' పేరిట నూతనంగా 24/7 డిజిటల్ వీడియో బ్రాడ్ కాస్టింగ్ ను ప్రారంభించింది. డొనాల్డ్ ట్రంప్, న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీ.. దీన్ని లాంఛనంగా ప్రారంభించారు. రౌండ్ ద క్లాక్.. వార్త ప్రసారాలు కొనసాగుతాయి ఇందులో. ఓ రెగ్యులర్ టీవీ ఛానల్ తరహాలో దేశ, విదేశాల్లో జరిగే విశేషాలు, డొనాల్డ్ ట్రంప్ పరిపాలనకు సంబంధించిన అప్ డేట్స్, ప్రెస్ కాన్ఫరెన్సులు.. అన్నీకూడా ఇందులో బ్రాడ్ కాస్ట్ అవుతాయి. ఆయా మీడియా సంస్థల ప్రతినిధులక వైట్ హౌస్ లో ఎంట్రీని నిషేధించడానికి నిరసనగా మీడియా సంస్థలు తనను బహిష్కరించడానికి సిద్ధమవుతున్నాయనే ప్రచారంపై డొనాల్డ్ ట్రంప్ ఘాటుగా స్పందించారు. ఇటువంటి ప్రచారాలను చూసి తాను ఆందోళన చెందట్లేదని, వీటిని పెద్దగా పట్టించుకోననీ అన్నారు. సమాజంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుందనే నైతికత మీడియాపై కూడా ఉంటుందనే విషయాన్ని గ్రహించాలని హితవు పలికారు. తన పాలనా కాలంలో సాధించిన ఘనతలను మీడియా తక్కువ చేసి చూపిస్తోందని ట్రంప్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో తాము భారీ మెజారిటీతో చారిత్రాత్మకమైన విజయాన్ని నమోదు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అమెరికా చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అత్యుత్తమ ఆర్థిక ప్రగతిని సాధించామని, దేశ ఆర్థిక వ్యవస్థలోకి సుమారు 21 ట్రిలియన్ డాలర్ల రికార్డు స్థాయి భారీ పెట్టుబడులు తరలివచ్చాయని పేర్కొన్నారు. అమెరికా స్వర్ణయుగం ఇక్కడి నుంచే ఆరంభమైందని ప్రకటించారు. తాము దేశ ప్రయోజనాల కోసం అద్భుతంగా పని చేస్తోంటే.. మీడియా మాత్రం ఎప్పుడూ ప్రతికూల వార్తలనే ప్రసారం చేస్తోందని, సానుకూల అంశాలను చూపించట్లేదని ట్రంప్ ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఎనిమిది యుద్ధాలను తాము శాంతియుతంగా పరిష్కరించామని పునరుద్ఘాటించారు. ఇరాన్ వ్యవహారాల గురించి ప్రస్తావించారు. ఆ దేశం అణ్వాయుధాలు తయారు చేసుకోకుండా సమర్థవంతంగా అడ్డుకట్ట వేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# "మమ్మల్నే బ్యాన్ చేస్తారా?"






## ట్రంప్ ప్రభుత్వాన్ని కోర్టుకీడ్చిన మీడియా సంస్థలు..!

ప్రపంచ పెద్దన్నగా భావించే అమెరికాలో, తమ దేశాధ్యక్షుడిని మూడు మీడియా సంస్థలు కోర్టుకీడ్చాయి. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే అమెరికాలో తమకు రాజ్యాంగం కల్పించిన వెసులుబాటును వాడుకుంటూ మూడు ప్రధాన మీడియా సంస్థలు ట్రంప్ కు వ్యతిరేకంగా ఒక్కట య్యాయి. అంతే కాదు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడిగా కోర్టులో దావా వేశాయి. దీంతో ఈ వ్యవహారం అమెరికాతో పాటు ప్రపంచదేశాల్లో చర్చనీయాంశమవుతోంది.ఇలా డొనాల్డ్ ట్రంప్ సర్కార్ పై కోర్టులో దావా వేసిన మీడియా సంస్థల్లో ప్రఖ్యాత సీఎన్ఎన్ వార్తా సంస్థతో పాటు ఎంఎస్ నౌ, పొలిటికో ఉన్నాయి. ఇంతకీ ఈ మూడు మీడియా సంస్థలు ట్రంప్ ప్రభుత్వంపై ఎందుకు న్యాయపోరాటానికి దిగాయో తెలుసా ? అధ్యక్ష నివాసం అయిన వైట్ హౌస్ లోకి తమ మీడియా ప్రతినిధుల్ని రాకుండా నిషేధం విధించినందుకు ఈ సంస్థలు కోర్టును ఆశ్రయించాయి. అధ్యక్షుడి అధికారిక నివాసంలోకి తమ ప్రతినిధుల్ని రానివ్వకుండా ఎలా అడ్డుకుంటారని అవి ఇప్పుడు ప్రశ్నిస్తున్నాయి. దీంతో ట్రంప్ కు ఏం చెప్పాలో తెలియని పరిస్థితి. ఫేక్ న్యూస్ ప్రసారం చేస్తున్నాయనే కారణంతో సీఎన్ఎన్ వార్తా సంస్థతో పాటు ఎంఎస్ నౌ, పొలిటికో పై వైట్ హౌస్ లోకి అడుగుపెట్టకుండా ట్రంప్ నిషేధం విధించారు. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయా మీడియా సంస్థలు.. తాము ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా దావా వేస్తున్నట్లు వైట్ హౌస్ కు సమాచారం ఇచ్చాయి. తమ ఫస్ట్ అమెండ్ మెంట్ హక్కుల్ని కాపాడుకునేందుకు, అలాగే వైట్ హౌస్ లోకి వచ్చే మీడియా ప్రతినిధుల్ని ట్రంప్ సర్కార్ ఎంపిక చేసుకునే హక్కును సవాల్ చేస్తూ తాము ఉమ్మడిగా ఈ దావా వేస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో ఇప్పుడు కోర్టులో ఆయా సంస్థల్ని ఫేక్ న్యూస్ ప్రసారం చేస్తున్నారనే కారణంతో తాము అడ్డుకున్నామని ట్రంప్ సర్కార్ వాదించుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

# ప్రసాదంలో మత్తుమందు కలిపి.. మహిళలపై నకిలీ బాబా అత్యాచారం..



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:** తమిళనాడులోని సేలం జిల్లాలో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. తనను తాను దేవుడిగా ప్రకటించుకున్న ఓ నకిలీ బాబా మహిళలు, మైనర్ బాలికలే లక్ష్యంగా అత్యాచారానికి పాల్పడుతున్నట్లు తేలింది. అంతేకాక ఆ దృశ్యాలను వీడియో తీస్తున్నట్లు స్పష్టమైంది. తన వద్దకు సమస్యలతో వచ్చే మహిళలు, యువతులకు ప్రసాదంలో మత్తుమందు కలిపి నకిలీ బాబా అత్యాచారానికి పాల్పడుతున్నట్లు తేలిన నేపథ్యంలో తాజాగా పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. ఆ వీడియోలను అమ్ముకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఆ డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని విజయరాజ(50)గా గుర్తించారు. నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి తమదైన శైలిలో దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సేలం జిల్లాలోని వజపాడిలో సీక్రెట్ గా ఓ ఆశ్రమం నిర్వహిస్తున్నాడు విజయరాజ. తనను తాను దేవుడిగా చెప్పుకుండా అక్కడకు వచ్చే మహిళలు, మైనర్ బాలికలకు పూజలు నిర్వహిస్తున్నాడు. అలా అతని వద్దకు వచ్చే మహిళలకు మత్తుమందు కలిపిన తీర్థం, ప్రసాదాలు ఇచ్చి వారిపై లైంగికంగా దాడులకు పాల్పడేవాడు. ఆ దృశ్యాలను వీడియో తీసి డార్క్ వెబ్ లో విక్రయించేవాడని పోలీసులు స్పష్టం చేశారు. అయితే ఇటీవల వినాయక చవితి చందాల కోసం వచ్చిన ఓ పాఠశాల విద్యార్థినితో విజయరాజ అసభ్యంగా ప్రవర్తించడంతో ఈ దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. దాంతో అతని చీకటి బాగోతం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు స్పష్టం చేశారు. బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో సాలెం జిల్లా పోలీసులు కేసు నమోదు చేసుకుని విజయరాజను అదుపులోకి తీసుకొని విచారించారు. అయితే దర్యాప్తులో భాగంగా.. నకిలీ బాబా ల్యాప్ టాప్ లో 50 కు పైగా అశ్లీల వీడియోలను పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలోనే తన వద్దకు వచ్చే మహిళలకు ప్రసాదంలో మత్తుమందు కలిపి వారిపై అత్యాచారానికి పాల్పడినట్టు విచారణలో తేలిందన్నారు. ఆపై వీడియోలు తీసి, డార్క్ వెబ్ సైట్స్ లో విక్రయించి వాటితో డబ్బులు పోగేసుకున్నట్టు విజయరాజ నేరం అంగీకరించిన పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు ఈ కేసుపై పూర్తి స్థాయిలో అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# యూట్యూబర్ నందన దంపతులపై ప్రజావాణిలో బాధితుల ఫిర్యాదు

యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలతో నమ్మించి నిరుద్యోగుల నుంచి భారీగా నగదు వసూలు చేసిన నేరంలో యూట్యూబర్ నందన, ఆమె భర్త మధుకర్ లపై ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే యూట్యూబర్ నందన దంపతులపై సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు బాధితులు క్యూ కట్టారు. తమకు న్యాయం చేయాలని అధికారులను బాధితులు కోరారు. ఈ మేరకు బేగంపేటలోని జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో బాధితులు.. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్ పర్సన్, ప్రజావాణి ఇన్ ఛార్జి గద్వాల విజయలక్ష్మిని కలిసి తమ సమస్యను విన్నవించారు. యూకే ప్రభుత్వం తమ కన్సల్టెన్సీకి ఉద్యోగుల నియామక ప్రక్రియ కోసం అనుమతులు మంజూరు చేసిందని నందన, మధుకర్ దంపతులు తమను నమ్మబలికి కోట్లాది రూపాయలు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ముఖ్యంగా స్టూడెంట్, విజిటర్ వీసాలపై యూకేకు వెళ్లి, వీసా గడువు ముగియనున్న వారిని క్రమంగా లక్ష్యంగా చేసుకుని వర్క్ వీసాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని ఫిర్యాదులో బాధితులు తెలిపారు. ఈ మేరకు ఒక్కొక్కరి నుంచి రూ. 25 లక్షల నుంచి రూ. 95 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే సదరు కన్సల్టెన్సీ సమర్పించిన పత్రాలు నకిలీవని తేలడంతో యూకే ప్రభుత్వం తమపై కఠిన చర్యలు తీసుకుందని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావాణికి ఫిర్యాదు చేసిన బాధితుల్లో తెలంగాణలోని వికారాబాద్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నట్లు తెలిపారు.బాధితుల ఫిర్యాదులను స్వీకరించిన ప్రజావాణి ఇన్ ఛార్జి గద్వాల విజయలక్ష్మి, ఇతర అధికారులు.. ఈ వ్యవహారాన్ని రాష్ట్ర డీజీపీ, ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టికి తీసుకెళ్లాలని అందుకు తమవంతు దర్యాప్తు చేసేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో వరుస కేసులు ఎదుర్కొంటున్న యూట్యూబర్ నందన దంపతులకు ఇది బిగ్ షాక్ అని చెప్పొచ్చు. ఇక ఇటీవల శంషాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో యూట్యూబర్ నందనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఏపీలోని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. ఇబ్రహీంపట్నం పోలీసులు విమానాశ్రయానికి వెళ్లి ఆమెను కస్టడీలోకి తీసుకున్నారు.

# ఏపీలో పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు బదిలీ

**అమరావతి,సెప్టెంబర్ 21:** ఏపీలో పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీ సాయిప్రసాద్.. ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్లు బదిలీ అయిన వారిలో ఉన్నారు. అలాగే ముంబైకి చెందిన వివాదాస్పద నటి కాదంబరి జెత్వాని కేసులో సస్పెన్షన్‌కు గురై ఇటీవలే తిరిగి విధుల్లోకి చేరిన ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులకు కూడా పోస్టింగ్‌లు లభించాయి.2004, 2005 బ్యాచ్ ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలపై గతంలో ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. నటి కాదంబరి జెత్వాని, ఆమె కుటుంబ సభ్యులను నిబంధనలకు విరుద్ధంగా నిర్బంధించి వేధించారనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం వీరిపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ వివాదాస్పద కేసు అప్పట్లో పోలీస్ శాఖలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఇటీవలే ప్రభుత్వం వీరి సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. వీరిద్దరూ గతంలో విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్, డిప్యూటీ పోలీస్ కమిషనర్ గా పని చేసిన విషయం తెలిసిందే.దీంతో వీరిద్దరూ రీజాయిన్ అయినప్పటికీ.. అప్పట్లో పోస్టింగ్





ఇవ్వలేదు. జీఏడీలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. తాజాగా చోటు చేసుకున్న బదిలీల నేపథ్యంలో వారికి పోస్టింగులు లభించాయి. కాంతి రాణా టాటాను ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ డైరెక్టరేట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గా నియమించారు. విశాల్ గున్నీ ట్రైనింగ్ విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గా అపాయింట్ అయ్యారు. మంగళగిరి పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా కూడా విశాల్ గున్నీకి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది ప్రభుత్వం.ఈ బదిలీల ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని మరికొందరు కీలక అధికారుల స్థానాలు మారాయి. ప్రస్తుతం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వర్తిస్తున్న 2005 బ్యాచ్ అధికారి త్రివిక్రమ్ వర్మ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ ఐజీ, డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఏసీబీ డైరెక్టర్ ఆర్ జయలక్ష్మి.. సీఐడీ సైబర్ క్రైమ్స్ విభాగం ఐజీగా నియమితులయ్యారు.ఏపీ స్పెషల్ పోలీసు బెటాలియన్స్ ఐజీ బీ రాజకుమారి.. రైల్వే ఐజీగా బదిలీ అయ్యారు. ఆమెకు సీఐడీ మహిళా భద్రతా విభాగం ఐజీగా పూర్తి అదనపు బాధ్యతలు లభించాయి. ప్రస్తుతం ఈ స్థానం ఖాళీగా ఉంటోంది. అలాగే గ్రేహౌండ్స్ డీఐజీ బాబూజీ అట్టాడను టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా బదిలీ చేయగా, ఆయన ఖాళీగా ఉన్న గ్రేహౌండ్స్ డీఐజీగా కూడా అదనపు పూర్తిస్థాయి బాధ్యతలను పర్యవేక్షించాల్సి ఉంటుంది.మూడు జిల్లాలకు కొత్త ఎస్పీలను కూడా నియమించింది ప్రభుత్వం. పోలవరం ఓఎస్డీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పంకజ్ కుమార్ మీనాను మార్కాపురం జిల్లా కొత్త ఎస్పీగా బదిలీ చేసింది. పల్నాడు, పోలవరం జిల్లా ఎస్పీలుగా జగదీష్ అడహళ్లి, కే చక్రవర్తి నియమితులయ్యారు.

# రైతులకు ఇన్‌పుట్ డీలర్లు ఉత్తమ సేవలు అందించాలి



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

ఇన్‌పుట్ డీలర్లు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని రైతులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్ఐ) కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు.

జిల్లాకు చెందిన 40 మంది అభ్యర్థులు ఏడాది కాలం నిర్వహించిన డీఏఈఎస్ఐ కోర్సును పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. ఈ సందర్బంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఇన్‌పుట్ డీలర్ల సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు రైతులకు సరైన వ్యవసాయ సలహాలు అందించేందుకు ఈ కోర్సు దోహదపడుతుందని అన్నారు .మేనేజ్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఏఎంఈటీఐ శాస్త్రవేత్తలు, అర్హత కలిగిన నిపుణులతో అభ్యర్థులకు వివిధ అంశాలపై శిక్షణ అందించినట్లు తెలిపారు . నేల ఆరోగ్యం, వ్యవసాయ ఉత్పాదకతలో నేల ఆరోగ్యం ప్రాధాన్యత, సమగ్ర తెగుళ్ల నిర్వహణ, వ్యవసాయ యంత్రాలు–పరికరాల వినియోగం, రైతులతో సమర్థవంతంగా మమేకమయ్యే విస్తరణ పద్ధతులు, విత్తన ఉత్పత్తి–నిర్వహణ, నీటిపారుదల పద్ధతులపై శిక్షణ పొందినారని అన్నారు .వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఇన్‌పుట్ డీలర్లు ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్‌లపై సరైన అవగాహన కల్పిస్తూ, శాస్త్రీయ సాగు విధానాలపై సూచనలు అందించాలని పేర్కొన్నారు.కోర్సును పూర్తి చేసిన ప్రతి అభ్యర్థి తన పరిజ్ఞానాన్ని రైతుల ప్రయోజనాలకు ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగంతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, డీఏఈఎస్ఐ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**-గ్రీవెన్స్ డేలో 19 ఫిర్యాదులు స్వీకరణ..**

**- ఎస్పీ మహేష్ బి. గితే**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల :

బాధితుల సమస్యలను పరిష్కరించి, వారికి సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.సోమవారం జిల్లా పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 19 ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన.. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ చేపట్టి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేలా పోలీస్ శాఖ పనిచేస్తోందన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పోలీస్ శాఖపై ప్రజలకు మరింత నమ్మకం, భరోసా కలిగేలా అధికారులు పనిచేయాలని ఎస్పీ సూచించారు. గ్రీవెన్స్ డేలో స్వీకరించిన



ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావచ్చని, అందిన ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలి



**-మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి పిలుపునిచ్చారు. కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చౌరస్తాలో కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా, తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా పనిచేస్తున్న సమయంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన తొలి మంత్రిగా చరిత్రలో నిలిచారని తెలిపారు.ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కొండ లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు తన విలువైన సూచనలు, సలహాలు అందిస్తూ మార్గదర్శకంగా నిలిచారని అన్నారు.అఖిల భారత పద్మశాలి సంఘం ఏర్పాటులోనూ కీలక పాత్ర పోషించి, పద్మశాలీల సమస్యల పరిష్కారం కోసం పోరాడటంతో పాటు కుల బాంధవుల ఐక్యతకు విశేష కృషి చేశారని అన్నారు.కొండ లక్ష్మణ్ బాపూజీ సేవలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ నెల 27న నిర్వహించనున్న కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో ప్రజలు, ముఖ్యంగా పద్మశాలి కులబాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు దూడం శంకర్, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు సబ్బని హరీష్, సంఘం కార్యవర్గ సభ్యులు, యువజన విభాగం ప్రతినిధులు, పాలిస్టర్ అసోసియేషన్, చేనేత వస్త్ర వ్యాపార సంఘాల ప్రతినిధులు, పద్మశాలి కులబాంధవులు, పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

# రోస్టర్ విధానాన్ని సవరించాలి

**మాల మహానాడు డిమాండ్**

**ఎల్లారెడ్డిపేట ప్రజావాణిలో ఫిర్యాదు**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రోస్టర్ విధానంలో మార్పులు చేయాలని, 99 జీవోను రద్దు చేసి 22 రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో సోమవారం ఎల్లారెడ్డిపేట ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

మాల విద్యార్థులు, ఉద్యోగస్తులు, నిరుద్యోగులకు రోస్టర్ విధానం వల్ల అన్యాయం జరుగుతోందని మాల మహానాడు నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాల మహానాడు పిలుపు మేరకు ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేస్తున్నట్లు తెలిపారు. మాల వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం రోస్టర్ విధానాన్ని పునఃపరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి రోడ్డ రామచంద్రం, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల రాజ్‌కుమార్, ఎల్లారెడ్డిపేట హడాక్ కమిటీ అధ్యక్షులు ఎడ్ల సందీప్, ఎల్లారెడ్డిపేట అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రేసు జగన్, కిషన్‌దాస్‌పేట అధ్యక్షులు జీడి శ్రీనివాస్, అల్మాస్పూర్ ఉపసర్పంచ్ కొర్రి అనిల్‌కుమార్, లింగాల సందీప్, రామిండ్ల బాబు, లింగాల దాసు, బుర్కా ధర్మేందర్, మంత్రి రాజు, కే. వెంకటేష్, రేసు శంకర్, పెరమాండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు రూ.50 వేల విలువైన స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



**విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించాలి.**

**సర్పంచ్ ఎనుగందుల నరసింహులు.**

బలగం టీవీ, ఎల్లారెడ్డి పేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌కు ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనుగందుల నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం రూ.50 వేల విలువైన స్పోర్ట్స్ కిట్లను పాఠశాలకు అందజేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ ఎనుగందుల నరసింహులు మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పుడూ సెల్‌ఫోన్లు పట్టుకుని సమయాన్ని వృథా చేయకుండా చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లోనూ మంచి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని సర్పంచ్ నరసింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# బ్రిడ్జి కోసం అనంతారం యువకుడి ఆమరణ నిరాహార దీక్ష

**-అసంపూర్తి పనులతో ఏళ్లుగా ఇబ్బందులు.. పట్టించుకునే పాలకులే కరువు**

**-పనులు ప్రారంభించే వరకు దీక్ష విరమించేది లేదంటున్న యువజన నాయకుడు**

బలగం టీవీ , ఇల్లంతకుంట:

అసంపూర్తిగా ఉన్న బిక్కవాగు బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ అనంతారం గ్రామానికి చెందిన యువజన నాయకుడు అక్కేమ్ నాగరాజు ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఇల్లంతకుంట మండలంలోని అనంతారం–ఇల్లంతకుంట గ్రామాల మధ్య బిక్కవాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండి ఏళ్లు గడుస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని బ్రిడ్జిపై గ్రామ యువకులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నాగరాజు దీక్షకు కూర్చున్నారు. ఆయనకు పలువురు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. బిక్కవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా మిగిలిన పనులను పూర్తి చేయడంలో జాప్యం జరుగుతోందన్నారు. బ్రిడ్జి అసంపూర్తిగా ఉండటంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.బ్రిడ్జిపై ప్రయాణించే సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి మిగిలిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు బ్రిడ్జి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బ్రిడ్జి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యే వరకు ఆమరణ నిరాహార దీక్షను విరమించేది లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో అనంతారం గ్రామ యువకులు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొని దీక్షకు మద్దతు తెలిపారు.



# గొల్లపల్లిలో కిరాణా, బేకరీ షాపుల్లో పోలీసుల తనిఖీలు

**గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట,

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండ్ పరిసరాల్లోని కిరాణా, బేకరీ తదితర దుకాణాల్లో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. దుకాణాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశంపై ప్రత్యేకంగా పరిశీలించారు. గంజాయి లేదా మత్తు పదార్థాలను విక్రయించినా, నిల్వ చేసినా సంబంధిత షాపు యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ బృందంతో పాటు కానిస్టేబుల్ సదుర్ల సతీష్ పాల్గొన్నారు.



# తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అన్నదానం..

బలగం టీవీ,వేములవాడ:

వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పాల్గొని

వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు, ప్రజలకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంగళ శ్రీకాంత్ గౌడ్, ప్రేమ్ చారి, సిరిగిరి చందు, కందుల క్రాంతి, గోస్కుల రవి, కర్ల శేఖర్, కమలాకర్ రెడ్డి, మ్యాకల శ్రీనివాస్, నీరటి మల్లేశం, సత్యనారాయణ రెడ్డి, రేగుల రాజేశం, దేవరాజు, పైడ శ్రీనివాస్, రాకేష్, మహేందర్ యాదవ్, కిరణ్ కుమార్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



# కేటీఆర్ సహకారంతో ఐదు రోజుల్లో దుబాయ్ నుంచి స్వగ్రామానికి ఓల్లపు రవి పార్థివదేహం..

బలగం టీవీ, తంగళ్లపల్లి:

దుబాయ్‌లో మృతి చెందిన తంగళ్లపల్లికి చెందిన ఓల్లపు రవి పార్థివదేహం కేటీఆర్ గారి సహకారంతో ఐదు రోజుల్లో స్వగ్రామానికి చేరుకుంది. ఓల్లపు రవి మృతిచెందిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొల్లి రామ్మోహన్ ఈ విషయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. కేటీఆర్ సహకారంతో అవసరమైన చర్యలు వేగవంతం కావడంతో రవి పార్థివదేహాన్ని దుబాయ్ నుంచి స్వగ్రామమైన తంగళ్లపల్లికి ఐదు రోజుల్లో తీసుకురాగలిగారు.

స్వగ్రామానికి చేరుకున్న ఓల్లపు రవి పార్థివదేహానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బొల్లి రామ్మోహన్, ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, పడిగేల మానస–రాజు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు బండి జగన్, ఎం.డి. హమీద్, బగ్గు లింగం తదితర బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్థివదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడంలో సహకరించిన కేటీఆర్ కి, బొల్లి రామ్మోహన్ కి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు సివిల్స్ ఉచిత శిక్షణ..

### - యూపీఎస్సీ సివిల్స్-2027కు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్.. సెప్టెంబర్ 23 వరకు దరఖాస్తుల స్వీకరణ..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష–2027కు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న సిరిసిల్లలోని గిరిజన స్టడీ సర్కిల్‌లో శ్రీరామ్ ఐఏఎస్ కోచింగ్ సంస్థ సహకారంతో రెసిడెన్షియల్ విధానంలో ఇంటిగ్రేటెడ్ గ్రాడ్యుయేట్ కోర్సును నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థులను అప్టిట్యూడ్ టెస్ట్, రాత పరీక్షల ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

శిక్షణకు ఎంపికయ్యే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదని అధికారులు వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు 'welfare.sriramias.com' వెబ్‌సైట్‌లో ఈ నెల 23వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9121087421 నంబర్‌కు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.



## గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

### -శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదు..

### - ఎస్పీ మహేష్ బి. గితే

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, నిమజ్జనాన్ని సురక్షితంగా పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని పలు గణేష్ మండపాలను సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల వద్ద ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 2,200 గణేష్ మండపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని,నిమజ్జనం రోజున ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని,నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేస్తే సంబంధిత డీజే యజమానులు, నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు సమర్థవంతంగా అమలు చేయాలని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డా. రవీందర్ నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (DM&HO) కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా ప్రోగ్రాం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

సమావేశంలో జిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రస్తుత పరిస్థితి, నిర్దేశిత లక్ష్యాల సాధన, కార్యక్రమాల పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై ప్రోగ్రాం అధికారులను డా. రవీందర్ నాయక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని లక్ష్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల కింద అందుతున్న సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్, డిప్యూటీ DM&HO డా. నాగేందర్ బాబు, డా. రామారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. అనిత, ప్రోగ్రాం అధికారులు డా. రామకృష్ణ, డా. వేణుగోపాల్ రెడ్డి, డా. నయీమ్ జహా తదితరులు పాల్గొన్నారు.



## కోదురుపాక పీహెచ్‌సీని పరిశీలించిన డీహెచ్ రవీందర్ నాయక్

బలగం టీవీ, వేములవాడ

రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ రవీందర్ నాయక్ కోదురుపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఫార్మసీ, ల్యాబొరేటరీ, ఓపీ విభాగాలను పరిశీలించి మందుల నిల్వలు, పరీక్షలు, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు, పరీక్షల సామగ్రి అందుబాటులో ఉంచాలని సూచించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జ్వర కేసులను వెంటనే గుర్తించి పరీక్షలు నిర్వహించాలని, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఏంజెలిన్ ఆల్ఫ్రెడ్, డాక్టర్లు రాంరెడ్డి, నాగేంద్రబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రేణు ప్రియాంక, డేటా మేనేజర్ కార్తీక్, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



## 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం..

### - విద్యానగర్‌లో మురికినీటి కాలువ, కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ..

బలగం టీవీ, సిరిసిల్ల:

సిరిసిల్ల పట్టణంలోని 3వ వార్డులో అభివృద్ధి పనులకు సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. విద్యానగర్‌లో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు ప్రధాన మురికినీటి కాలువ మరియు కల్వర్టు నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ.. ప్రజల నిత్యావసరాల కారణంగా వెలువడే మురికినీటి ప్రవాహానికి సరైన పారుదల వ్యవస్థ లేకపోవడంతో నీరు నిలిచిపోతుందని తెలిపారు. దీంతో దోమలు, ఇతర కీటకాలు వృద్ధి చెంది స్థానిక ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపే క్రమంలో భాగంగానే ప్రధాన మురికినీటి కాలువతో పాటు కల్వర్టు నిర్మాణ పనులను చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సిరిసిల్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులను చేపడుతూ పట్టణ సమగ్ర అభివృద్ధికి పాలకవర్గ సభ్యులంతా కృషి చేస్తున్నారని ఆమె తెలిపారు. అనంతరం నిర్మాణ పనుల్లో మెరుగైన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్ సభ్యులు దార్నం అరుణ లక్ష్మీనారాయణ, మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ సభ్యులు మ్యాన్ రవి, గెంట్యాల శ్రీనివాస్, మాజీ శివ సాయి బాబా దేవాలయ అధ్యక్షులు మామిడాల కృష్ణ, మాజీ FACS డైరెక్టర్ గడీల సురేష్, పద్మశాలి సంఘం సిరిసిల్ల ఉపాధ్యక్షులు గాజుల బాలయ్య, బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల అధ్యక్షులు జిందం చక్రపాణి, సీనియర్ నాయకులు దూస రాజేశం, బండారి శివ, వేముల హరికృష్ణ, సబ్బని నరేందర్, జిందం దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి..

### - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### - ఐడీఓసీలో 172 దరఖాస్తుల రాక

### - రెవెన్యూ డివిజన్ కార్యాలయాలకు 18.. ఎంపీడీఓ కార్యాలయాలకు మొత్తం 59 దరఖాస్తుల రాక..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

అధికారులు ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కాగా ప్రజావాణికి మొత్తం 172 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు.

సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 08 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 10 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

**మండలాల్లో స్వీకరణ..**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ప్రజావాణి ఎంపీడీఓలు నిర్వహించి.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

**మండలాల వారీగా దరఖాస్తులు వివరాలు..**



బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 03, చందుర్తి మండలం 03, ఇల్లంతకుంట మండలం 04, గంభీరావుపేట మండలం 05, కోనరావుపేట మండలం 02, ముస్తాబాద్ మండలం 16, రుద్రంగి మండలం 01, తంగళ్లపల్లి మండలం 03, వీర్నపల్లి మండలం 05, వేములవాడ అర్బన్ మండలం 03, వేములవాడ రూరల్ మండలం11, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి 03 చొప్పున వచ్చాయి.

**మండల, డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి..**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్ని చోట్ల అప్లికేషన్లు ఆన్లైన్ చేస్తారని పేర్కొన్నారు.

ఐడీఓసీ ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో గణనాథునికి ప్రత్యేక పూజలు..



### - భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జన కార్యక్రమం..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహానికి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడు ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలను ప్రసాదించాలని, ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది చేపట్టిన ప్రతి కార్యం ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తయ్యేలా ఆశీర్వదించాలని మహాగణపతిని ప్రార్థించినట్లు తెలిపారు. గత ఏడు రోజులుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో విశేష పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ శోభాయాత్రను ప్రారంభించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని డప్పు వాయిద్యాల నడుమ కోలాటాలు, ఆటపాటలతో గణనాథునికి వీడ్కోలు పలికారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంలో సహకరించిన పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ లు, సి.ఐ లు, ఆర్.ఐ లు,ఎస్.ఐ లు, కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మంత్రితో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణతో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించారని తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు ప్రభుత్వం నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్లు భూ సేకరణ పరిహారం నిర్వాసితులకు పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పురోగతిని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ఇప్పటికే విడుదలైన రూ.2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. భూసేకరణ నిబంధనల ప్రకారం జరగాలని ఆదేశించారు.

భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే హైదరాబాద్‌లోని భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు.

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులు గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎల్ నినో నేపథ్యంలో రానున్న సీజన్లో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్

### హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఎస్ఐఆర్–2026 ప్రక్రియలో భాగంగా రానున్న 30 నుంచి 40 రోజులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్–2026 కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేయడంతో పాటు వాటిపై తదుపరి చర్యలు చేపట్టి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ప్రతి బీఎల్ఓకు నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వారి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

అక్టోబర్ చివరి వారంలోగా అనామలీస్, ఇతర మ్యాపింగ్‌కు సంబంధించి ఓటర్లకు జారీ చేయాల్సిన నోటీసులు, వాటి పరిష్కార ప్రక్రియలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు.

ఎస్ఐఆర్–2026కు సంబంధించిన అన్ని పనులను 25-10-2026లోపు పూర్తి చేయాలని, చివరి 10 రోజులను చివరి క్షణంలో అవసరమయ్యే సవరణలు, ఇతర ప్రక్రియల కోసం కేటాయించుకోవాలని ఆదేశించారు. ఫారం-6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా అందజేయాలని స్పష్టం చేశారు.

ఓటర్లకు జారీ చేసే నోటీసులను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.

వయోవృద్ధులు, దివ్యాంగులు, విదేశాల్లో ఉన్న ఓటర్ల తరపున వారి కుటుంబ సభ్యులు విచారణకు హాజరై సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ఈ విషయంపై బీఎల్ఓలు సంబంధిత ఓటర్లకు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు.



బీఎల్ఓ స్థాయిలో ఐదు రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, జిల్లాలో ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఎస్ఐఆర్–2026 ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

నోటీసుల జారీ, విచారణ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్ఓ జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, తహసీల్దార్లు మహేష్, జయంత్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, ఎలక్షన్ సెక్షన్ అధికారి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు సబ్బని హరీష్ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సబ్బని హరీష్ మాట్లాడుతూ.. పద్మశాలి సమాజానికి చెందిన గొప్ప నాయకుడిగా, తెలంగాణ ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడిగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిరస్మరణీయులని అన్నారు. సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, తెలంగాణ సాధన కోసం బాపూజీ చేసిన కృషి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని సబ్బని హరీష్ అన్నారు. ఆయన సేవలను భవిష్యత్ తరాలకు తెలియజేస్తూ, పద్మశాలి సమాజ ఐక్యత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.



# ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల నేటి షెడ్యూల్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆసియా క్రీడల్లో సెప్టెంబర్ 22న భారత క్రీడాకారులు పలు విభాగాల్లో పోటీపడనున్నారు. భారత కాలమానం ప్రకారం వివిధ క్రీడాంశాల్లో పోటీల సమయాలు ఇలా ఉన్నాయి.

కళాత్మక జిమ్నాస్టిక్స్: మహిళల అర్హత పోటీలు (వాల్ట్)లో ప్రణతి నాయక్ ఉదయం 10:30 గంటలకు.

బ్యాడ్మింటన్: మహిళల జట్టు క్వార్టర్‌ఫైనల్లో జపాన్‌తో ఉదయం 6 గంటలకు, పురుషుల జట్టు క్వార్టర్‌ఫైనల్లో జపాన్‌తో ఉదయం 11:30 గంటలకు తలపడనుంది.

బాక్సింగ్: పురుషుల 55 కేజీల రౌండ్ ఆఫ్ 32లో జదుమణి సింగ్ మందెంగ్‌బామ్–థాపా చంద్ర బహదూర్ మధ్య పోరు మధ్యాహ్నం 1:30 గంటల నుంచి. మహిళల 51 కేజీల రౌండ్ ఆఫ్ 32లో సాక్షి–ఐరా విలెగాస్ పోరు ఉదయం 8:30 గంటల నుంచి.

క్రికెట్: మహిళల ఫైనల్లో భారత్–శ్రీలంక మ్యాచ్ ఉదయం 10:30 గంటలకు.

ఈ-స్పోర్ట్స్: ఈ-ఫుట్‌బాల్ గ్రూప్-ఎఫ్ తొలి మ్యాచ్‌లో డేనియల్ పటేల్, చిన్మయ్ సాహూ ఉదయం 5:30 గంటలకు.

ఈక్వెస్ట్రియన్: ఈవెంటింగ్ జట్టు, వ్యక్తిగత విభాగాల్లో డ్రెస్సేజ్ పోటీలు ఉదయం 5:45 గంటలకు, షో జంపింగ్ పోటీలు మధ్యాహ్నం 12 గంటలకు. అశిష్ లిమాయే, ఫౌవాద్ మిర్జా, అర్జున్ నాగ్రా పాల్గొంటారు.

ఫెన్సింగ్: పురుషుల ఫాయిల్ వ్యక్తిగత పూల్ దశలో సచిన్, సనాసం హేమాష్ సింగ్ ఉదయం 6:30 గంటల నుంచి. మహిళల ఎపీ వ్యక్తిగత పూల్ దశలో తానిషా ఖత్రీ, మిత్వా చౌదరి ఉదయం 8:15 గంటల నుంచి పోటీపడతారు. అర్హత సాధిస్తే రౌండ్ ఆఫ్ 32, రౌండ్ ఆఫ్ 16, క్వార్టర్‌ఫైనల్స్, సెమీఫైనల్స్, ఫైనల్స్ వరుసగా మధ్యాహ్నం వరకు కొనసాగనున్నాయి.

హాకీ: పురుషుల పూల్-ఎ మ్యాచ్‌లో భారత్–శ్రీలంక పోరు మధ్యాహ్నం 3:30 గంటలకు.

కబడ్డీ: పురుషుల గ్రూప్-ఎ మ్యాచ్‌లో భారత్–దక్షిణ కొరియా పోరు ఉదయం 7:15 గంటలకు.

కరాటే: పురుషుల -84 కేజీల కుమితే సెమీఫైనల్లో చేతన్ భట్ ఉదయం 7:35 గంటలకు. అర్హత సాధిస్తే 7:50 గంటలకు కాంస్య పతక పోరు, మధ్యాహ్నం 12:40 గంటలకు ఫైనల్లో పాల్గొంటారు. మహిళల -55 కేజీల కుమితే రౌండ్ ఆఫ్ 16లో అలీషా ఉదయం 9:20 గంటలకు ఇండోనేషియాకు చెందిన కోక్ ఇస్త్రీ అగుంగ్ సనిస్వారణితో తలపడనుంది. అర్హత ఆధారంగా క్వార్టర్‌ఫైనల్, సెమీఫైనల్, రిపెచేజ్, కాంస్య పతక పోరు, ఫైనల్ జరగనున్నాయి.

సాఫ్ట్ టెన్నిస్: మహిళల సింగిల్స్‌లో ఆధా తివారీ–అలీషా జీగ్లర్ ఉదయం 5:30 గంటలకు, పురుషుల సింగిల్స్‌లో జే మీనా–హుస్సేన్ అరైన్ ఉదయం 7 గంటలకు, ఆర్యన్ ఠాకూర్–బోల్డ్-ఎర్డెన్ ఆల్టాంగెరెల్ ఉదయం 9:30 గంటలకు తలపడతారు. ఆధా తివారీ–కైనాత్ షాల్వానీ మ్యాచ్ ఉదయం 10:30 గంటలకు, ఆర్యన్ ఠాకూర్–పో-యి చెన్ మ్యాచ్ మధ్యాహ్నం 12 గంటలకు.

సెపక్ టక్రా: పురుషుల జట్టు రెగు విభాగంలో గ్రూప్-బిలో మలేసియాతో ఉదయం 5:30 గంటలకు.

ఈత: పురుషుల 1500 మీటర్ల ఫ్రీస్టైల్‌లో ఆర్యన్ నెహ్రా ఉదయం 7:29 గంటలకు ఫైనల్-బిలో పాల్గొంటారు. పురుషుల 4×100 మీటర్ల మెడ్లీ రిలే హీట్-2 ఉదయం 8:05 గంటలకు. రోహిత్ బెనెడిక్షన్, దనుష్ సురేశ్, రిషభ్ దాస్, ఆకాష్ మణి బృందంలో ఉన్నారు. అర్హత సాధిస్తే ఫైనల్ మధ్యాహ్నం 2:55 గంటలకు.

షూటింగ్: 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ అర్హత పోటీలో పార్థ్ మానే, ఎలవెనిల్ వలరివన్ ఉదయం 6:15 గంటలకు. స్కీట్ పురుషుల వ్యక్తిగత, జట్టు విభాగాల్లో అనంత్‌జీత్ సింగ్ నరూకా, భవ్‌తేజ్ సింగ్ గిల్, మైరాజ్ అహ్మద్ ఖాన్, మహిళల విభాగాల్లో పరినాజ్ ధాలీవాల్, రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్ ఉదయం 6:30 గంటల నుంచి పోటీపడతారు. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్ ఉదయం 8:25 గంటలకు.

టేబుల్ టెన్నిస్: మహిళల జట్టు రౌండ్ ఆఫ్ 16లో థాయ్‌లాండ్‌తో ఉదయం 6:30 గంటలకు, పురుషుల జట్టు రౌండ్ ఆఫ్ 16లో ప్రత్యర్థి ఇంకా ఖరారు కావాల్సి ఉండగా ఉదయం 9 గంటలకు మ్యాచ్.

వుషు: మహిళల నాన్క్వాన్–నాండావో ఫైనల్లో హంజాబమ్ లాంగ్‌లెంటోంబి దేవి ఉదయం 6:29 గంటలకు. మహిళల 60 కేజీల సాండాలో రోషిబినా దేవి క్వార్టర్‌ఫైనల్ మధ్యాహ్నం 2:30 గంటల నుంచి. పురుషుల 56 కేజీల సాండాలో ఆర్యన్ క్వార్టర్‌ఫైనల్ కూడా మధ్యాహ్నం 2:30 గంటల నుంచి.

# ఆసియా క్రీడల పతకాల పట్టికలో 12వ స్థానంలో భారత్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆసియా క్రీడల రెండో అధికారిక రోజు ముగిసే సమయానికి భారత్ ఆరు పతకాలతో పతకాల పట్టికలో 12వ స్థానంలో నిలిచింది. భారత్ నాలుగు రజతాలు, రెండు కాంస్య పతకాలు సాధించింది. స్వర్ణ పతకం ఖాతాలో చేరలేదు.

23 స్వర్ణాలు, 10 రజతాలు, 5 కాంస్యాలతో మొత్తం 38 పతకాలు సాధించిన చైనా అగ్రస్థానంలో కొనసాగుతోంది. జపాన్ 8 స్వర్ణాలు, 12 రజతాలు, 12 కాంస్యాలతో 32 పతకాలతో రెండో స్థానంలో ఉంది. దక్షిణ కొరియా 5 స్వర్ణాలు, 3 రజతాలు, 15 కాంస్యాలతో 23 పతకాలతో మూడో స్థానంలో ఉంది.

కజకిస్థాన్ నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలతో నాలుగో స్థానంలో ఉండగా, థాయ్‌లాండ్ మూడు స్వర్ణాలు, ఒక రజతంతో ఐదో స్థానంలో ఉంది. హాంకాంగ్ చైనా రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, మూడు కాంస్యాలతో ఆరో స్థానంలో ఉంది.

మొత్తం 29 దేశాలు ఇప్పటివరకు పతకాలు సాధించాయి. ఇండోనేషియా ఏడు పతకాలతో 13వ స్థానంలో, ఇరాక్, కువైట్ తదితర దేశాలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. పాకిస్థాన్ ఒక కాంస్య పతకంతో 25వ స్థానంలో ఉంది.

**భారత్ – 6 పతకాలు:**

స్వర్ణం – 0
రజతం – 4
కాంస్యం – 2




## ఆసియా క్రీడలకు 13 మంది సభ్యుల భారత మహిళల రగ్బీ జట్టు ప్రకటన!

### కెప్టెన్‌గా శిఖా యాదవ్ ఎంపిక; పూల్-బిలో చైనా, హాంకాంగ్, మలేషియాలతో భారత్ తలపడేలా షెడ్యూల్

**బలగం టీవీ, హైదరాబాద్**

జపాన్‌లో జరుగుతున్న ఆసియా గేమ్స్ 2026 కోసం 13 మంది సభ్యులతో కూడిన భారత మహిళల రగ్బీ సెవెన్స్ జట్టును భారత రగ్బీ సమాఖ్య సోమవారం ప్రకటించింది. ఈ టోర్నీలో భారత జట్టుకు స్టార్ ప్లేయర్ శిఖా యాదవ్ కెప్టెన్‌గా నాయకత్వం వహించనుండగా, దుముని మార్ండి వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. గ్రూప్ దశలో భారత్ కాస్త కఠినమైన పూల్-బిలో డిఫెండింగ్ ఛాంపియన్ చైనా, హాంకాంగ్, మలేషియా జట్లతో తలపడనుంది.

మహిళల రగ్బీ సెవెన్స్ విభాగంలో భారత జట్టు 2010 గువాంగ్‌జౌ ఆసియాడ్‌లో తొలిసారిగా బరిలోకి దిగింది. అయితే 2014, 2018 ఆసియా క్రీడలకు అర్హత సాధించలేకపోయిన భారత్.. గత హ్యాంగ్‌జౌ ఆసియాడ్ ద్వారా మళ్లీ పునరాగమనం చేసింది. గత హ్యాంగ్‌జౌ టోర్నీలో ఆడిన జట్టు నుంచి ఆరుగురు క్రీడాకారిణులు ఈసారి కూడా తమ స్థానాలను నిలబెట్టుకోవడంతో భారత జట్టుకు అంతర్జాతీయ అనుభవం బాగా కలసిరానుంది.

శిఖా యాదవ్, దుముని మార్ండిలతో పాటు సంధ్యా రాయ్, మామా నాయక్, కళ్యాణి పాటిల్, వైష్ణవి పాటిల్‌లు గత ఆసియాడ్ అనుభవం ఉన్న ఆటగాళ్లుగా జట్టులో కొనసాగుతున్నారు. హెడ్ కోచ్ పాల్ డెల్‌పోర్ట్ మాట్లాడుతూ.. ఈ టోర్నీ కోసం ఆటగాళ్లు తీవ్రంగా శ్రమించారని, ఒత్తిడిని జయించి ప్రణాళికలను సరిగ్గా అమలు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. రగ్బీ ఇండియా అధ్యక్షుడు రాహుల్ బోస్ కూడా ఈ ఆసియాడ్ టోర్నీ మహిళా రగ్బీ అభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్నారు.

భారత మహిళల రగ్బీ జట్టు: శిఖా యాదవ్ (కెప్టెన్), దుముని మార్ండి (వైస్ కెప్టెన్), అమన్‌దీప్ కౌర్, ఆర్తి కుమారి, భూమిక శుక్లా, వైష్ణవి పాటిల్, గురియా కుమారి, కళ్యాణి పాటిల్, మామా నాయక్, నిర్మాల్య రౌత్, సంధ్యా రాయ్, సంధ్యారాణి తుడు, ఉజ్వల ఘుగే.

# సీఎస్‌కే హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ జట్టు చెన్నై సూపర్ కింగ్స్ కీలక నిర్ణయం తీసుకుంది. భారత మాజీ బౌలర్ జహీర్ ఖాన్‌ను జట్టు ప్రధాన కోచ్‌గా నియమించింది. ఐపీఎల్ 2027 సీజన్ నుంచి జహీర్ సీఎస్‌కేకు కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు జట్టు యాజమాన్యం సోమవారం సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించింది.



ఇప్పటివరకు సీఎస్‌కే ప్రధాన కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్ కొనసాగారు. ఆయన స్థానంలో జహీర్ ఖాన్‌ను నియమించారు. సీఎస్‌కే ఇప్పటివరకు 16 ఐపీఎల్ సీజన్లలో పాల్గొని ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచింది. 2023లో ఎంఎస్ ధోని నాయకత్వంలో చివరిసారిగా టైటిల్ గెలుచుకుంది. ఆ తర్వాత రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినా జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది.

2026 సీజన్‌లో సీఎస్‌కే పేలవ ప్రదర్శన చేసింది. 14 మ్యాచ్‌ల్లో ఆరు విజయాలతో పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. నాకౌట్ దశకు కూడా అర్హత సాధించలేకపోయింది. దీంతో 2027 సీజన్ కోసం జట్టును మరింత బలోపేతం చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో భాగంగానే కోచ్ బాధ్యతల నుంచి ఫ్లెమింగ్‌ను తప్పించి జహీర్ ఖాన్‌కు అప్పగించింది.

# ఆసియా క్రీడల్లో భారత్ పతకాల జోరు

### ఒక్కరోజే నాలుగు పతకాలు..
### ఎంఎంఏలో సుచికా తారియాల్ చరిత్ర

**బలగం టీవీ, హైదరాబాద్**



ఆసియా క్రీడలు–2026లో భారత్ పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం ఒక్కరోజే భారత క్రీడాకారులు నాలుగు పతకాలు సాధించారు. వీటిలో మూడు పతకాలు షూటింగ్‌లో రాగా, సుచికా తారియాల్ మహిళల సంప్రదాయ 60 కేజీల మిశ్రమ యుద్ధకళ విభాగంలో కాంస్య పతకం సాధించి చరిత్ర సృష్టించారు. ఆసియా క్రీడల్లో మిశ్రమ యుద్ధకళల్లో భారత్‌కు ఇదే తొలి పతకం కావడం విశేషం. దీంతో భారత్ పతకాల సంఖ్య ఆరుకు చేరింది. ఇందులో నాలుగు రజతాలు, రెండు కాంస్యాలు ఉన్నాయి.

పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో హిమాంశు ధిల్లాన్, రుద్రాంక్ష్ పాటిల్, పార్థ్ మానే రజత పతకం సాధించారు. భారత బృందం 1,890.1 పాయింట్లు సాధించగా, 1,899.0 పాయింట్లతో చైనా స్వర్ణం దక్కించుకుంది.



అనంతరం పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో హిమాంశు ధిల్లాన్ 252.4 పాయింట్లతో రజత పతకం సాధించాడు. చైనాకు చెందిన షెంగ్ లిహావో 254.2 పాయింట్లతో స్వర్ణం గెలిచి కొత్త ఆసియా క్రీడల రికార్డు నెలకొల్పాడు. ఇదే విభాగంలో మాజీ ప్రపంచ ఛాంపియన్ రుద్రాంక్ష్ పాటిల్ 230.9 పాయింట్లతో కాంస్య పతకం సాధించాడు. ఒకే వ్యక్తిగత విభాగంలో ఇద్దరు భారత షూటర్లు తొలి మూడు స్థానాల్లో నిలవడం విశేషం. ఆసియా క్రీడల్లో హిమాంశుకు ఇదే అరంగేట్రం కాగా, ఒకే రోజు రెండు పతకాలు సాధించాడు.

మరోవైపు మహిళల సంప్రదాయ 60 కేజీల మిశ్రమ యుద్ధకళ విభాగంలో సుచికా తారియాల్ కాంస్య పతకం సాధించింది. క్వార్టర్‌ఫైనల్లో మంగోలియాకు చెందిన అల్టాన్‌చిమెగ్ బైగాల్మాను 2–0తో ఓడించి సెమీఫైనల్‌కు చేరింది. దీంతో పతకం ఖాయమైంది. సెమీఫైనల్లో సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియోతో పోరు డ్రాగా ముగిసింది. అనంతరం ఉదయం నిర్వహించిన బరువు కొలత ఆధారంగా విజేతను నిర్ణయించగా, సుమారు 700 గ్రాముల బరువు తక్కువగా ఉన్న టియోకు విజయం దక్కింది. దీంతో సుచికా కాంస్యంతో సరిపెట్టుకుంది.

భారత్ గత రోజు మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో ఎలావెనిల్ వలరివన్ వ్యక్తిగత రజతంతో పాటు, సోనం ఉత్తమ్ మాస్కర్, విదర్భా వినోద్ కొచ్చలుంకల్‌తో కలిసి టీమ్ రజతం సాధించింది. దీంతో షూటింగ్ విభాగం భారత్‌కు ఇప్పటివరకు ఐదు పతకాలు అందించింది.

# పాక్‌ను చిత్తు చేసిన భారత పురుషుల టీటీ జట్టు!

### 3-0తో ఏకపక్ష విజయం; హర్మీత్, సత్యన్, పయాస్ అద్భుత ప్రదర్శన

**బలగం టీవీ, హైదరాబాద్**

అయిచి-నగోయా (స్పోర్ట్స్ డెస్క్): జపాన్‌లో జరుగుతున్న ఆసియా గేమ్స్ 2026లో భారత పురుషుల టేబుల్ టెన్నిస్ జట్టు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. సోమవారం పాకిస్తాన్‌తో జరిగిన గ్రూప్ దశ పోరులో భారత్ 3-0 తేడాతో ఘనవిజయం సాధించింది. హర్మీత్ దేశాయ్, సత్యన్ జ్ఞానశేఖరన్, పయాస్ జైన్‌లు తమ సింగిల్స్ మ్యాచ్‌ల్లో విజయం సాధించడంతో ఏ ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా భారత్ మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

తొలి సింగిల్స్ మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 11-4, 11-3, 11-5 తేడాతో పాకిస్తాన్‌కు చెందిన మహమ్మద్ ఖాన్‌ను చిత్తు చేసి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అనంతరం రెండో మ్యాచ్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్ 11-1, 11-8, 11-9 తేడాతో అబ్బాస్ ఖాన్‌పై విజయం సాధించి ఆధిక్యాన్ని 2-0కి పెంచాడు. ఆఖరి సింగిల్స్ మ్యాచ్‌లో పయాస్ జైన్ 11-2, 11-5, 11-5 తేడాతో ముహమ్మద్ ఖాన్‌ను ఓడించి 3-0తో సిరీస్ విజయాన్ని ఖాయం చేశాడు.

ఈ గెలుపుతో భారత పురుషుల జట్టు నాకౌట్ దశకు చేరుకునే అవకాశాలను మరింత మెరుగుపరుచుకుంది. అంతకుముందు సోమవారం ఉదయం జరిగిన మహిళల టేబుల్ టెన్నిస్ పోటీల్లోనూ భారత మహిళల జట్టు 3-0 తేడాతో పాకిస్తాన్‌ను ఓడించి నాకౌట్ దశకు అర్హత సాధించడం గమనార్హం.




# ఆస్ట్రేలియాపై భారత అండర్-19 జట్టు విజయం!



### యశ్‌బర్ధాన్ చౌహాన్ మెరుపు సెంచరీ
### సిరీస్ చేజిక్కించుకున్న టీమిండియా

**బలగం టీవీ, హైదరాబాద్**

సొంతగడ్డపై ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల యూత్ వన్డే సిరీస్‌ను భారత అండర్-19 జట్టు మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సొంతం చేసుకుంది. రెండో వన్డేలో అద్భుత ప్రదర్శన చేసిన భారత్ 102 పరుగుల భారీ తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసి సిరీస్‌ను కైవసం చేసుకుంది. టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ (48 బంతుల్లో 47) విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నప్పటికీ తృటిలో అర్ధసెంచరీ చేజార్చుకున్నాడు.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత అండర్-19 జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 341 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బ్యాటర్ యశ్‌బర్ధాన్ చౌహాన్ (100 బంతుల్లో 122; 15 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీతో చెలరేగగా, వి.కె. వినీత్ (92 బంతుల్లో 87) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. రాహుల్ ద్రవిడ్ తనయుడు అన్వయ్ ద్రవిడ్ (9) మాత్రం ఈ మ్యాచ్‌లో విఫలమయ్యాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో థామస్ వాసియో 3 వికెట్లు పడగొట్టాడు.

అనంతరం 342 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా అండర్-19 జట్టు భారత బౌలర్ల ధాటికి 41.1 ఓవర్లలో 239 పరుగులకే ఆలౌటైంది. ఆసీస్ కెప్టెన్ జాక్ జోస్నెక్ (81) పోరాడినప్పటికీ జట్టును గెలిపించలేకపోయాడు. భారత బౌలర్లలో చిగురుపాటి వెంకట 3 వికెట్లు తీసి మెరవగా, కావ్య పరేష్ పటేల్, యశ్‌బర్ధన్ చౌహన్‌లు రెండేసి వికెట్లు పడగొట్టి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించారు.

# సెప్టెంబరు 22 నుంచి బెంగళూరు ఓపెన్..

### బరిలోకి టాప్ ఇండియన్ గోల్ఫర్లు!
### 132 మంది ప్రొఫెషనల్స్‌తో టోర్నీ;
### కర్ణాటక గోల్ఫ్ అసోసియేషన్ వేదికగా పోటీలు

**బలగం టీవీ, హైదరాబాద్**

భారతదేశానికి చెందిన ప్రముఖ గోల్ఫర్లు సప్తక్ తల్వార్, హనీ బైసోయా, వీర్ అహ్లావత్‌లు సెప్టెంబరు 22 నుంచి 25 వరకు జరగనున్న 'బెంగళూరు ఓపెన్' టోర్నీలో పాల్గొనడానికి సిద్ధమయ్యారు. కర్ణాటక గోల్ఫ్ అసోసియేషన్ (KGA) మైదానంలో జరగనున్న ఈ ప్రతిష్టాత్మక టోర్నీ 5వ ఎడిషన్ మొత్తం రూ. 1 కోటి ప్రైజ్‌మనీతో నిర్వహించబడుతోంది.

ఈ టోర్నీలో మొత్తం 132 మంది ప్రొఫెషనల్స్, ఒక అమేచర్ ప్లేయర్ పోటీపడనున్నారు. పీజీటీఐ (PGTI) ఆర్డర్ ఆఫ్ మెరిట్ లీడర్ సప్తక్ తల్వార్, వీర్ అహ్లావత్‌లు త్వరలోనే జపాన్‌లో జరగబోయే ఆసియా గేమ్స్‌లో భారత తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

స్థానిక బెంగళూరు గోల్ఫర్లలో చిక్కరంగప్ప ఎస్, అక్షయ్ నిరంజన్, మనోజ్ ఎస్, మారీ ముత్తు ఆర్, వరుణ్ ముత్తప్పలు ప్రధాన ఆకర్షణగా నిలవనుండగా.. తనిష్ ఆర్ గౌడ అమేచర్ క్రీడాకారుడిగా బరిలోకి దిగుతున్నాడు. వీరితో పాటు శ్రీలంకకు చెందిన ఎన్ తంగరాజా, మిథున్ పెరేరా, థాయిలాండ్‌కు చెందిన తనపట్ పిచైకూల్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన స్టెపాన్ డానెక్ వంటి పలువురు విదేశీ ప్లేయర్లు కూడా ఈ టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.




# జపాన్, బంగ్లాదేశ్‌లను చిత్తు చేసిన భారత కబడ్డీ జట్లు!







### పురుషుల విభాగంలో జపాన్‌పై 49-24తో విజయం
### బంగ్లాపై 42-21తో గెలిచిన భారత మహిళల జట్టు

**బలగం టీవీ, హైదరాబాద్**

జపాన్‌లో జరుగుతున్న ఆసియా గేమ్స్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్లైన భారత పురుషుల, మహిళల కబడ్డీ జట్లు ఘనవిజయాలతో తమ స్వర్ణ పతకాల వేటను ప్రారంభించాయి. సోమవారం తోకాయ్ సిటీ గ్రౌండ్‌లో జరిగిన గ్రూప్ దశ తొలి మ్యాచ్‌లలో భారత పురుషుల జట్టు ఆతిథ్య జపాన్‌ను 49-24 తేడాతో ఓడించగా, మహిళల జట్టు 42-21 తేడాతో బంగ్లాదేశ్‌పై తిరుగులేని విజయం సాధించింది.

పురుషుల మ్యాచ్‌లో భారత రైడర్లు అయాన్ లోహచాబ్, దేవాంక్ దలాల్ విజృంభించడంతో హాఫ్‌టైమ్ సమయానికే భారత్ 31-9తో అలవోక ఆధిక్యాన్ని సాధించింది. రెండవ సగంలో మరో 18 పాయింట్లు జోడించిన భారత జట్టు మొత్తంగా 36 అవుట్ పాయింట్లు, 8 ఆల్‌అవుట్ పాయింట్లు, 2 సూపర్ టాకిల్ పాయింట్లతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. గ్రూప్-ఎలో ఉన్న భారత పురుషుల జట్టు మంగళవారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో దక్షిణ కొరియాతో తలపడనుంది.

మరోవైపు మహిళల మ్యాచ్‌లోనూ భారత క్రీడాకారిణులు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. తొలి సగంలో 21-10తో ఆధిక్యంలో నిలిచిన భారత మహిళలు, ద్వితీయార్థంలోనూ అదే జోరు కొనసాగించి 27 అవుట్ పాయింట్లు, 11 బోనస్, 4 ఆల్‌అవుట్ పాయింట్లతో మ్యాచ్‌ను ముగించారు. గ్రూప్-ఎలో ఉన్న భారత మహిళల జట్టు తమ తదుపరి పోరులో బలమైన ఇరాన్‌తో పోటీపడనుంది.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# CINEMA

## సుకుమార్ శిష్యులకు 'ద్వితీయ విఘ్నం' టెన్షన్..

### బుచ్చిబాబు తర్వాత శ్రీకాంత్ ఓదెల వంతు!

బుచ్చిబాబు సానా 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకోవడంతో ఆయనకు టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా 'పెద్ది' అనే భారీ పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కించే అవకాశం దక్కింది. భారీ అంచనాల మధ్య విడుదలైన 'పెద్ది'లో రామ్ చరణ్ నటనకు ప్రశంసలు దక్కాయి. అయితే కథనం, కొన్ని పాత్రల రూపకల్పన, నాటకీయత విషయంలో దర్శకుడిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా హీరోయిన్ జాన్వీ కపూర్ పాత్ర విషయంలో సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. ఈ అంశంపై బుచ్చిబాబు కూడా స్పందిస్తూ వివరణ ఇచ్చారు. అయితే బాక్సాఫీస్ పరంగా కూడా 'పెద్ది'పై విడుదలకు ముందు ఉన్న భారీ అంచనాలకు అనుగుణంగా ఫలితం రాలేదనే చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో బుచ్చిబాబు రెండో సినిమాతో ఎదుర్కొన్న అనుభవాన్ని సినీ వర్గాలు 'ద్వితీయ విఘ్నం'గా ప్రస్తావిస్తున్నాయి. ఇక ఇప్పుడు మరో సుకుమార్ శిష్యుడు శ్రీకాంత్ ఓదెల రెండో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'దసరా'తో దర్శకుడిగా పరిచయమైన శ్రీకాంత్ ఓదెల.. తొలి సినిమాతోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. నాని నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించడంతో శ్రీకాంత్ ఓదెలపై అంచనాలు భారీగా పెరిగాయి. ఇప్పుడు నానితోనే మరోసారి 'ది ప్యారడైజ్' చిత్రాన్ని తెరకెక్కించారు. దీంతో ఈ సినిమా ఆయన కెరీర్‌లో అత్యంత కీలకంగా మారింది. 'దసరా'లో గ్రామీణ నేపథ్యంలో రా అండ్ రస్టిక్ ప్రపంచాన్ని ఆవిష్కరించిన శ్రీకాంత్ ఓదెల.. 'ది ప్యారడైజ్'లో మరింత భారీ స్థాయి కథను తీసుకున్నట్లు చిత్ర బృందం చెబుతోంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో నాని పాత్ర ఎలా ఉండబోతోందనే ఆసక్తి



అభిమానుల్లో ఉంది. అయితే తొలి సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తర్వాత రెండో సినిమాతో దర్శకుడి పరిధి, ఆలోచనా విధానం మరింత విస్తరించడం సహజం. అదే సమయంలో అంచనాలు కూడా భారీగా పెరుగుతాయి. ఈ కారణంగానే తొలి విజయాన్ని రెండో సినిమాతో కొనసాగించగలరా? అనే చర్చ దర్శకుల కెరీర్‌లో ఆసక్తికర అంశంగా మారుతుంది.

## అప్పుడే పెళ్లా?

సుగి విజయ్, జుప్పీ భద్ర, హారిక రాజేందర్ ప్రధాన పాత్రల్లో నటించిన ప్రేమకథ 'ఐ హేట్ మ్యారేజ్'. పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడు. దయానంద్ మాదం, కార్తీక్ వెంపటి నిర్మాతలు. అక్టోబర్ చివరివారంలో సినిమా విడుదల కానున్నది. మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి 'అప్పుడే పెళ్లా?..' అంటూ సాగే పాటను సోమవారం హైదరాబాద్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో విడుదల చేశారు. ప్రముఖ నిర్మాత బెక్కెం వేణుగోపాల్ ఈ పాటను విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. కంటెంట్‌తోపాటు ఎమోషన్స్ ఉన్న సినిమా ఇదని, ఇందులో యువతకు సందేశం కూడా ఉందని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల హీరోహీరోయిన్లు ఆనందం వెలిబుచ్చారు. జెన్‌జీ బ్యాచ్‌కి కనెక్టయ్యే సినిమా ఇదని దర్శకుడు చెప్పాడు. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ సి.కుమార్, సంగీతం: వరికుప్పల యాదగిరి.



## కార్తికేయ 'కమ్‌బ్యాక్'



రెండేళ్ల విరామం తర్వాత హీరో కార్తికేయ నటిస్తున్న తాజా చిత్రం 'కమ్‌బ్యాక్'. విశేషమేమిటంటే ఈ సినిమా ద్వారా ఆయన దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. సోమవారం కార్తికేయ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాను ప్రకటిస్తూ స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. కార్తికేయ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై రూపొందిస్తున్న ఈ చిత్రానికి ఆయన సతీమణి లోహితా రెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు'మూడేళ్ల నుంచి ఏమైపోయాడో తెలియలేదు. ఇన్ని రోజులు ఏం చేస్తున్నాడు? అనే వాయిస్ ఓవర్‌తో మొదలైన గ్లింప్స్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇందులో హీరో కార్తికేయ బాక్సర్‌గా కనిపించారు. ఈ చిత్రానికి కెమెరా: జగదీశ్ చీకటి, సంగీతం: విజయ్ బుల్గానిన్, దర్శకత్వం: కార్తికేయ గుమ్మకొండ.

## అల్లు అర్జున్ 'రాకా'పై భారీ అంచనాలు..




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా'. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న చిత్రాల్లో ఇదొకటిగా ఇప్పటికే అంచనాలు ఏర్పడ్డాయి. అట్లీ తనదైన శైలిలో భారీ యాక్షన్, అద్భుతమైన విజువల్స్, ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో 'రాకా' నుంచి వచ్చే ప్రతి అప్‌డేట్‌పై అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా అల్లు అర్జున్, అట్లీ కలయిక కావడంతో సినిమాకు సంబంధించిన చిన్న విషయం కూడా సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన చర్చకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు అట్లీ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన ప్రత్యేక వీడియోపై ఇప్పుడు అభిమానుల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. అట్లీ పుట్టినరోజు సందర్భంగా 'రాకా' చిత్రబృందం ఓ ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించింది. ఈ సినిమాలోని విజువల్ అంశాల కోసం ఏకంగా 37 మంది మోకాప్ కళాకారులు పనిచేశారని, తద్వారా చిత్రబృందం గిన్నిస్ రికార్డును సాధించినట్లు ప్రకటించింది. ఇంత భారీ సంఖ్యలో మోకాప్ కళాకారులను ఉపయోగించడం సినిమాకు సంబంధించిన విజువల్ ఎఫెక్ట్స్, పాత్రల రూపకల్పన, యాక్షన్ సన్నివేశాలు ఏ స్థాయిలో ఉండబోతున్నాయనే ఆసక్తిని మరింత పెంచింది. సాధారణ సినిమాలతో పోలిస్తే భారీ స్థాయిలో సాంకేతికతను ఉపయోగిస్తున్నారనే సంకేతాన్ని ఈ ప్రకటన ఇచ్చింది. అయితే అభిమానులు మాత్రం ఈ ప్రకటనతో సంతృప్తి చెందలేకపోయారు. అట్లీ పుట్టినరోజు సందర్భంగా 'రాకా' నుంచి ఏదో ఒక భారీ సర్‌ప్రైజ్ వస్తుందని, ముఖ్యంగా సినిమా గ్లింప్స్ విడుదలవుతుందని చాలామంది ఆశించారు.

## హైదరాబాద్‌లో వరల్డ్ బిగ్గెస్ట్ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్న చిరంజీవి

మహేష్ బాబు, అల్లు అర్జున్ రూట్ వేరు.. మెగాస్టార్ చిరంజీవి ప్లాన్ వేరు! టాలీవుడ్ స్టార్ హీరోలు ఎగ్జిబిషన్ రంగంలో ఇప్పటికే తమదైన ముద్ర వేశారు. కానీ, ఇప్పుడు వారందరినీ మించేలా మెగాస్టార్ చిరంజీవి ఒక అద్భుతమైన ప్లాన్‌తో ముందుకొ స్తున్నారు. హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వేదికగా ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్క్రీన్‌ను తీసుకువచ్చేందుకు మెగాస్టార్ సన్నాహాలు చేస్తున్నారు. సినిమా థియేటర్ల వ్యాపారంలో అగ్రగామిగా ఉన్న 'ఏషియన్ సినిమాస్' తో కలిసి చిరంజీవి ఈ భారీ ప్రీమియం ప్రాపర్టీని ప్లాన్ చేస్తున్నారు. ఏషియన్ సినిమాస్ అధినేత సునీల్ నారంగ్ ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ విశేషాలను వెల్లడించారు. ప్రస్తుతం జర్మనీలోని 'ట్రామ్‌పాలస్ట్ లియోన్‌బర్గ్' స్క్రీన్ (సుమారు 127 అడుగుల వెడల్పు, 69 అడుగుల ఎత్తు, 8,770 చదరపు అడుగుల విస్తీర్ణం) పేరిట ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్క్రీన్ గిన్నిస్ రికార్డు ఉంది. అలాగే అమెరికాలోని జార్జియాలో రాయల్ సినిమాస్ ఐమ్యాక్స్ స్క్రీన్ కూడా భారీ హంగులతో ఉంది. కానీ, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి రికార్డులను సైతం వెనక్కి నెట్టేలా, ప్రపంచంలోనే నంబర్ వన్ స్క్రీన్‌ను హైదరాబాద్‌లో నిర్మించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంటోంది. టాలీవుడ్‌లో ఇప్పటికే ప్రీమియం సినిమా అనుభవాల కోసం పోటీ పెరిగింది. కోకాపేట్‌లోని అల్లు అర్జున్ 'అల్లు సినిమాస్'లో సుమారు 75 అడుగుల వెడల్పుతో కూడిన భారత్‌లో అతిపెద్ద డాల్బీ సినిమా స్క్రీన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరోవైపు మహేష్ బాబు కూడా ఏషియన్ గ్రూప్‌తో కలిసి 'ఏఎంబీ సినిమాస్' ద్వారా మల్టీప్లెక్స్ రంగంలో ట్రెండ్ సెట్ చేశారు. అయితే, వీటన్నింటినీ మించిపోయే రేంజ్‌లో చిరంజీవి ప్రాజెక్ట్ ఉండబోతుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన ఖచ్చితమైన కొలతలు, సీటింగ్ కెపాసిటీ, అత్యాధునిక ప్రొజెక్షన్ టెక్నాలజీ వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడి కానున్నాయి. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, హైదరాబాద్ సినిమా ప్రదర్శన ఖ్యాతి అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడం ఖాయం.



## 'ది ప్యారడైజ్' విడుదలపై కుట్ర?


### కోర్టును ఆశ్రయించిన నిర్మాతలు!

నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'ది ప్యారడైజ్' సినిమా సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా విడుదలకు కేవలం కొద్ది రోజుల ముందు ఈ చిత్రంపై సోషల్ మీడియాలో విపరీతమైన దుష్ప్రచారం జరుగుతోందని నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్పీ సంస్థ బెంగళూరు అదనపు నగర సివిల్ అండ్ సెషన్స్ కోర్టును ఆశ్రయించగా.. సెప్టెంబర్ 19న కోర్టు కొన్ని సోషల్ మీడియా ఖాతాలు, పోస్టులపై తాత్కాలిక ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సినిమా వ్యాపారాన్ని దెబ్బతీసే



కుట్ర? సాధారణ సినిమా విమర్శల పరిధిని దాటి కావాలని సినిమా వ్యాపారం, ప్రతిష్టను దెబ్బతీసే లక్ష్యంతోనే కొన్ని సోషల్ మీడియా ప్రొఫైల్స్ , కామెంట్లు, యూఆర్‌ఎల్‌లు పనిచేస్తున్నాయని నిర్మాతలు న్యాయస్థానానికి వివరించారు. చిత్ర నిర్మాణం, ప్రచారం, పంపిణీలో కోట్ల రూపాయల భారీ పెట్టుబడి పెట్టామని, విడుదలకు సరిగ్గా ముందు ఇలాంటి నష్టం కలిగించే కంటెంట్ ప్రచారంలో ఉంటే భారీ ఆర్థిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని నిర్మాతలు వాదించారు. ముందస్తు నోటీసులు లేకుండానే చర్యలకు విజ్ఞప్తి ఈ దుష్ప్రచారానికి బాధ్యులైన వ్యక్తులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే వెంటనే చర్యలు తీసుకోవాలని నిర్మాతలు న్యాయస్థానాన్ని కోరారు. నోటీసులు ఇస్తే ఆ కంటెంట్‌ను డిలీట్ చేయడం లేదా ఇతర ఖాతాల్లోకి మార్చి మరింత విస్తృతంగా వ్యాప్తి చేసే అవకాశం ఉందని వారు వెల్లడించారు. నిర్మాతల వద్ద ఉన్న సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం.. ఆ కంటెంట్ నిజంగానే సాధారణ విమర్శల పరిధిని దాటి ఆర్థిక నష్టాన్ని కలిగించేలా ఉందనే అభిప్రాయానికి వచ్చింది. తాత్కాలికంగా ఉత్తర్వులు అయితే ఈ తాత్కాలిక ఉత్తర్వులు కేవలం పిటిషన్ లో పేర్కొన్న కొన్ని నిర్దిష్టమైన పరువు నష్టం కలిగించే యూఆర్‌ఎల్‌లు, పోస్టులకు మాత్రమే వర్తిస్తాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. సినిమా విడుదలైన తర్వాత ప్రేక్షకులు లేదా విమర్శకులు ఇచ్చే నిజమైన సమీక్షలపై ఎలాంటి నిషేధం లేదని తేల్చిచెప్పింది. ఈ ఉత్తర్వులు తాత్కాలికమైనవని, ప్రతివాదులకు కోర్టు సమన్లు పంపిన తర్వాత ఈ కేసు తదుపరి విచారణ అక్టోబర్ 28న జరగనుంది. సినిమా ప్రచారంలో చివరి దశలో ఉన్న నిర్మాతలకు ఈ నిర్ణయం కొంత ఊరటనిచ్చింది.

## విడాకులపై కాజల్ అగర్వాల్ షాకింగ్ కామెంట్స్!



దేశంలో మారుతున్న అనుబంధాలు, విడాకుల కేసులు పెరుగుతున్న వేళ ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. మనుషుల మధ్య అనుబంధాలు, ప్రేమ, పెళ్లిపై నేటి తరం ఆలోచనా విధానంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువహా ఉందని కాజల్ అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్లో కనిపించే జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం వల్లే దంపతులపై అదనపు ఒత్తిడి పెరుగుతోందని ఆమె పేర్కొన్నారు. ఫోన్ల వల్లే భార్యాభర్తల మధ్య ప్రత్యక్ష సంభాషణలు తగ్గిపోతున్నాయని కాజల్ ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సంబంధాలలో సంభాషణ, సహనం తగ్గిపోవడమే దీనికి ప్రధాన కారణమని ఆమె అభిప్రాయ పడ్డారు. ఒకరి మాట ఒకరు వినడానికి సమయం కేటాయించకపోవడం, భాగస్వామితో గడపాల్సిన సమయంలో కూడా ఫోన్లు, సోషల్ మీడియాలో మునిగి తేలడం దంపతుల మధ్య దూరాన్ని పెంచుతోందని కాజల్ చెప్పుకొచ్చారు. తన భర్త గౌతమ్ కిచ్లుతో ఉన్న బంధాన్న దృఢంగా ఉంచుకోవడానికి వారు పాటించే ఓ చిన్న నియమాన్ని కాజల్ పంచుకున్నారు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ.. వారు ప్రతివారం ఓ రాత్రి కలిసి డిన్నర్‌కు వెళ్తారట. ఆ సమయంలో ఇద్దరూ తమ మొబైల్ ఫోన్లను పక్కన పెట్టేసి.. డిన్నర్ టేబుల్ వద్ద ఎలాంటి డిజిటల్ ఆటంకాలు లేకుండా కేవలం ఒకరికొకరు మాత్రమే సమయం కేటాయించుకుంటామని కాజల్ వివరించారు. ఈ డిన్నర్ డేట్ అనేది వినడానికి చిన్న విషయంగా అనిపించినప్పటికీ.. బంధంలో ఇది చాలా కీలకమైన పాత్ర పోషిస్తుందని కాజల్ అగర్వాల్ అభిప్రాయపడుతున్నారు. ఇద్దరూ తమ వృత్తిపరమైన పనుల్లో ఎంత తీరిక లేకుండా ఉన్నప్పటికీ.. ఫోన్ స్క్రోల్ చేయకుండా కూర్చుని మాట్లాడుకోవడం వల్ల మనసు విప్పి సంభాషించుకునే అవకాశం లభిస్తుందని వెల్లడించారు. ఇది దంపతుల మధ్య బంధాన్ని మరింత బలపరుస్తుందని చెప్పారు. కాజల్ అగర్వాల్, గౌతమ్ కిచ్లులకు 2020లో వివాహం జరగగా.. వారికి ఓ కుమారుడు ఉన్నాడు. నేటి వేగవంతమైన డిజిటల్ యుగంలో డిన్నర్లు కూడా ఫోన్లు చూసే కార్యక్రమంగా మారిపోతున్న తరుణంలో కాజల్ సూచించిన 'వారానికి ఒకసారి ఫోన్-ఫ్రీ డిన్నర్' అనే నియమం నేటి తరం జంటలకు ఎంతో ఉపయోగపడే ఓ మంచి సందేశంగా నిలుస్తోంది.

